J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 17 29.9.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




## రాష్ట్ర రాజకీయ తెరపై

# ప్రేమ కథా-చిత్రమ్

## పార్టీల భవిష్యత్తుతో పాటు.. ఆంధ్ర భవితను తేల్చనున్న ఎలక్షన్స్ - 2024

***స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్టు ఆంధ్ర రాజకీయాలను కొత్త మలుపు తిప్పబోతోంది. నిన్నటి వరకు బాబుతో పవన్ 'అక్రమ' సంబంధం పెట్టుకున్నాడని ఊదరగొట్టిన వైసీపీ నాయకుల మాటలను నిజం చేస్తూ... తమది అక్రమ సంబంధం కాదు, 'సక్రమ' సంబంధమే అంటూ తమ అపవిత్ర బంధాన్ని బహిరంగంగా ప్రకటించారు పవన్ కళ్యాణ్. ఒకవైపు బీజేపీతో దోస్తీ చేస్తూనే, మరోవైపు తాము టీడీపీతో కలిసి పోటీచేస్తామని పవన్ ప్రకటించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయవర్గాలలో చర్చనీయాంశంగా మారింది.***

***తాజాగా తెలుగు రాష్ట్రాలలో నడుస్తున్న రాజకీయాల తీరును ముక్కోణపు ప్రేమకథా చిత్రం (పొలిటికల్ ట్రయాంగిల్ లవ్ స్టోరీ)గా రాజకీయవర్గాల వారు విశ్లేషించుకుంటున్నారు.***

ఇది ఓ పాత తెలుగు సినిమా కథ లాంటిదే...

జగ్గయ్య సావిత్రిని ప్రేమిస్తాడు. సావిత్రేమో అక్కినేని నాగేశ్వరరావును చూసి పాటలు పాడుతూ ఉంటుంది. అక్కినేని నాగేశ్వరరావేమో జమున మీద మనసు పడి, ఆమె వెనుక తిరుగుతుంటాడు.

అలాగే, ఆంధ్ర విషయానికి వస్తే బీజేపీ కేంద్ర నాయకులు పవన్ కళ్యాణ్‌ను వైసీపీకి బలిచ్చే ఆలోచన చేస్తున్నారన్నది పరిశీలకుల అనుమానం. ఎందుకంటే, వైసీపీకి బీజేపీ నేరుగా మద్దతు ఇవ్వలేని స్థితిలో ఉంది. ముస్లిం ఓట్లను దృష్టిలో పెట్టుకుని వైసీపీ కూడా బీజేపీతో బహిరంగంగా పొత్తు పెట్టుకోలేదన్నది జగమెరిగిన సత్యం. వైసీపీ కష్టాన్ని అర్థం చేసుకున్న బీజేపీ కేంద్ర పెద్దలు, పవన్‌ను టీడీపీ నుంచి విడగొట్టడం ద్వారా వైసీపీకి తమవంతు సాయం చేయడానికి గట్టి ప్రయత్నం చేస్తున్నారన్నది కూడా ఒక విశ్లేషణగా ఉంది. పవన్ కళ్యాణేమో బీజేపీ మద్దతుతో టీడీపీతో జతకట్టి... వైసీపీని 'చింపేయాల'ని అనుకుంటున్నారు. ఓ వైపు ఒంటరిగా పోటీ చేయాలంటే ఆయనకి భయం. 2019 అనుభవమే ఎదురవుతుందేమోనన్న బెదురు. మరో వైపు అసెంబ్లీలోకి అడుగుపెట్టి తీరాలన్న తపన. బీజేపీ ఒప్పుకుంటే సరే, లేకపోయినా సరేనన్న తెగింపు.

టీడీపీకేమో బీజేపీ కేంద్ర పెద్దలను ఎలాగోలా లైన్‌లో పెట్టుకోవాలన్న తపన. బీజేపీతో జత కట్టకపోతే... జగన్‌ను, ఆయన సైన్యాన్ని హ్యాండిల్ చెయ్యడం కుదరదేమో అన్న జంకు. చివరకు... ఎలా, ఎప్పుడు... ఎవరికి 'వర్క్ ఔట్' అవుతుందో క్లైమాక్స్‌కు వచ్చేదాకా ఈ ముక్కోణపు ప్రేమకథా చిత్రానికి ముగింపు అర్థం కాదన్నది విశ్లేషకుల భావన.

రానున్న ఎన్నికలపై ఒక్క జనానికి తప్ప ఇంకెవరికీ ఏ విషయంలోనూ ఇప్పటికిప్పుడైతే స్పష్టత ఉన్నట్టు కనబడడం లేదు. పార్టీలు, వాటి ఎత్తుగడలతో సంబంధం లేకుండా ఓటర్లకి మాత్రం... 'ఫుల్లు'గా స్పష్టత వచ్చేసినట్టు చెప్తున్నారు. కాకపోతే, ఓటు రేటు ఎంత అన్నదే తేలాల్సి ఉంది. గత ఎన్నికల్లో ఓటు మూడు వేలు పలికిందని టాక్. కానీ, ఈసారి మన 'ఓటర్ మహాశయుడి' రేటు బాగా పెరగొచ్చని ఎన్నికల మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక, అసలు కథలోకి వెళ్దాం..!

10లో

**పతిపై సింపతీ కోసం.. తపిస్తున్న బాబు సతి**

సత్యపీఠం 4లో...








## బాలుకి..'వాకర్స్' నివాళి

గానగంధర్వుడు, భారతీయ సినిమా గాయకుడు, తన మధుర గానంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది శ్రోతలను అలరించిన శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) 3వ వర్థంతి సందర్భంగా నెల్లూరులోని ఆదిత్యనగర్ పార్కులో ఉన్న బాలు విగ్రహానికి వాకర్స్ ప్రతినిధులు, కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిల్డ్రన్స్ పార్క్ వాకర్స్ అసోసియేషన్, గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న ఈ కార్యక్రమం జరిగింది. వాకర్స్ ప్రతినిధులు రాయప్ప, పాముల రమణయ్య, మురళీమోహన్‌రావు, శివప్రసాద్‌నాయుడు, వాసుబాబు, కేశవనాయుడు, ఎస్‌వి సత్యం, బాషా, రాజారవీంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రివిలేజ్ కమిటీ సభ్యునిగా.. తూమాటి

రాష్ట్ర శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ సభ్యునిగా కందుకూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు నియమితులయ్యారు. ఆమేరకు ఈనెల 23న శాసనమండలి ఛైర్మెన్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

## వావిళ్ళ వారి సాహితీసేవ అపూర్వం

**- వితపు బాలసుబ్రహ్మణ్యం**

నెల్లూరుజిల్లాకు చెందిన వావిళ్ళ వారు గతంలో చెన్నైలో నివాసం ఉంటూ ఏళ్ళతరబడి చేసిన సారస్వత సేవలు అపూర్వమని, దాదాపు 170 సంవత్సరాలపాటు ఆంధ్ర, సంస్కృత సాహిత్యాలకు వావిళ్ల సంస్థ చేసిన సేవలు అనితరసాధ్యమని మాజీ ఎమ్మెల్సీ వితపు బాలసుబ్రహ్మణ్యం కొనియాడారు. వర్ధుల సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24న 'వావిళ్ల సాహితీ వికాసం' గ్రంథావిష్కరణ ఘనంగా జరిగింది. నెల్లూరు టౌన్‌హాలు లోని ఏసీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వితపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పుస్తకంలో వావిళ్ళ వారితో సంబంధమున్న పండితులు, వావిళ్ళ వారు ప్రచురించిన పుస్తకాల ముఖ చిత్రాలు కూడా ఉన్నాయని, రచయిత వెంకటరమణ ఎంతో పరిశ్రమించి పరిశోధించి ఈ పుస్తకం రూపొందించడం అభినందనీయమని అన్నారు. వావిళ్ళ సంస్థ ఆంధ్ర వాఙ్మయానికి చేసిన కృషి అనిర్వచనీయమని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త డా. కాళిదాసు పురుషోత్తం అన్నారు. అనంతరం గ్రంథరచయిత వెంకటరమణను సన్మానించారు. సాహితీ విమర్శకులు మాచవోలు శివరామప్రసాద్, సురేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**● కార్యకర్తలు, నాయకులకు రామ్ దిశానిర్ధేశం**



పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసుకుని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని, ముఖ్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికునిలా పార్టీ విజయం కోసం కృషి చేయాలని, అందరి సహకారంతోనే అఖండవిజయం సాధ్యమవుతుందని వైకాపా వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈనెల 24న వెంకటగిరిలోని తమ నివాసంలో రాపూరు మండలంలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, రాపూరు మండలంలోని 21 గ్రామపంచాయతీలోని నాయకులు, కార్యకర్తలు వైయస్సార్సీపి అభిమానులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

## అందరి 'బతుకొక ఉత్సవం' కావాలని...

సమాజాన్ని ప్రతిబింబించేలా ఉన్నప్పుడే సాహిత్యం పది కాలాల పాటు నిలుస్తుంది. ప్రముఖ కవి చిన్ని నారాయణరావు నిత్య జీవితంలో ఆదాయ వ్యయాలపై పన్నుల లెక్కలు చెప్పే ఆడిటర్ అయినా, ప్రతిరోజూ ప్రజల ఆలోచనా వ్యవహారాల్లోని చిక్కులు విప్పే తత్వంతో కవిత్వాన్ని మలుస్తుంటారు. ప్రస్తుతం సర్వత్రా వ్యాపిస్తున్న కాలుష్యం విషయంలో కవిత్వానికి మినహాయింపేమీ లేదు. మారుతున్న తీరుతెన్నులకు సన్మార్గదర్శకంగా ఉండేలా కవిత్వం రాయటం నారాయణరావు సహజ లక్షణం. అందుకు అక్షర రూపమే ఈ 'బతుకొక ఉత్సవం' కవిత్వం.


ప్రారంభ కవితలో బతుకు విలువను ఎలా మలుచుకోవాలో, ఎలా గెలుచుకోవాలో తెలుసుకొనేందుకు, మానసిక వికాసం కలిగించేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలా అంటారు –

"పెను సవాళ్ళను స్వీకరించైనా సరే / సమస్యల సమాధుల మీద నుంచి / ఛాతీలో దాక్కొన్న ఆత్మను / వెలికి తీసైనాసరే / స్వప్నాల్ని సాకారం చేస్తేనే కదా / బతుకొక ఉత్సవం అయ్యేది".

వర్తమాన సమాజంలో వ్యక్తిత్వాలు అసంపూర్ణంగా తయారవుతున్నాయి. అందువల్లే ఒకే వీధిలో ఉంటున్నవాళ్ళు కూడా ఒకరికొకరుగా దగ్గర కాలేకపోతున్నారు. ఇలాంటి వాతావరణాన్ని మేధావులంతా ఆలోచించాల్సిందే నంటూ 'ఎదురు చూడాల్సిందే' కవితలో – "నడుస్తున్న యంత్రాల సమూహంలో / తానూ యాంత్రికతను పులుముకోలేక / కళ తప్పిన వీధి కన్పించకుండా పోయింది / ఏ ఆశ బ్రతికి స్తుందో ఏమో వేచి చూడాల్సిందే" అంటూ ఆశావాదంతో ఆలోచనల్ని మేలుకొలుపుతున్నారు.

దశాబ్దకాలంగా నారాయణరావు కవిత్వాన్ని చదువుతూనే ఉన్నాను. వస్తువులో నవ్యత, శైలిలో నాణ్యత, శిల్పంలో నైపుణ్యత అనేవి వారి కవితారీతిలోని కాంతిరేఖలుగా అనిపిస్తూనే ఉంటాయి. అదే వారి ప్రత్యేకతగా ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఏ విషయాన్నయినా విశేషాంశంగా చెప్పటం, ఏ అంశాన్నయినా నూతన కోణంలో చూపటం నారాయణరావుకి వెన్నతో పెట్టిన విద్య. అక్షరాల్లో ఆ దృశ్యం కనిపిస్తుంది. అలా అందం చిందే 'ఫోటో స్మృతి' కవితలో – "ఇల్లంతా సందళ్ల పండుగయ్యేది / తాతా నానమ్మల బోసినవ్వుల సెలయేరయ్యేది/ పిల్లలు రంగు రంగుల సీతాకోకచిలుకలై / అలరారే సమయం ఆసన్నమయ్యేది / అదో కుటుంబ నేపథ్యానికి ఎక్స్‌రే సంకేతమయ్యేది" అంటారు.

కవులెప్పుడూ స్వేచ్ఛకు, స్వచ్ఛతకు పట్టం కడుతూనే వుంటారు. నెల్లూరు మొలగొలుకులు బియ్యంతో నెయ్యం ఎల్లలు దాటిపోయింది. ఏ వస్తువు మీద కవిత రాసినా అంతర్లీనంగా సద్భావాలకే అంతరంగం ఆరాటపడుతుంది. ఆ విషయం 'మా మొలగొలుకులు' కవితలోని పలుకులు ఇలా తెలుపుతున్నాయి. "రండి మళ్ళీ మనం మొలగొలుకులవుదాం! / చక్కగా కాసిన మాగాణుల మవుదాం / మొలకెత్తే కలుపును పీకేసి / స్వచ్ఛ నెల్లూరుకు బాటలు వేద్దాం!". స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న మనం, గాంధీజీ సిద్ధాంతాలను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నాం. శాశ్వత విలువలకు తాత్కాలికంగా దూరమైనా భారతీయ తత్వాలను, అమూల్య జీవన సూత్రాలను ఎన్నటికీ మరువకూడదని హెచ్చరిస్తూ "గాంధీయిజంలో...!" వారి నైజం చూపించారు – "ఆయనో ఉద్యమ కిరీటధారి / మాటల మహాత్ముడు కాదు / చేతల స్వాతంత్ర్య గళం ఆయనే / బ్రిటిష్ సామ్రాజ్యం పాలిట గరళమూ ఆయనే / గాంధీయిజంలో నిజం ఎప్పటికీ అజేయం / అది ఆచరణీయం! అనుసరణీయం!"



బతుకొక ఉత్సవం
రచయిత:
చిన్ని నారాయణరావు
పేజీలు: 140 వె.రూ. 160/-
ప్రతులకు: చిన్ని నారాయణరావు
శ్రీకేతనమ్, 27-1-167,
ఆదిత్యనగర్, చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు,
నెల్లూరు - 2. సెల్: 94402 02942

'రైతు దేశానికి వెన్నెముక' అంటున్నాం. 'రైతే రాజు' అని కీర్తిస్తున్నాం. కానీ, వాస్తవచిత్రం మరోలా మనకు దర్శనమిస్తోంది. రైతు బాగుంటేనే అందరం బాగుంటాము. ఆ గౌరవంతోనే 'రైతన్నే మిన్న' కవితలో మన బాధ్యతను గుర్తు చేస్తున్నారు – "రైతెక్కిన పల్లకీలు మోసే / బోయీల మవుదాం / రైతు నడయాడిన నేలకు ప్రణమిల్లుదాం"... అంటారాయన.

'మాట' పేరుతో దీర్ఘ కావ్యాన్ని రచించి 'లాయర్' పత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డికే ఆవిష్కరింపచేసిన నారాయణరావు ఈ 'బతుకొక ఉత్సవం'ను 'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి దివ్యస్మృతికి అంకితం చేయటం గొప్ప విషయం. వారిని గురుదేవులుగా గౌరవించే నారాయణరావు, 'చరితార్థుడు రాజగోపాలుడు' అనే కవితలో తన భావాలను ఇలా ఆవిష్కరించారు – "నెల్లూరు గడ్డపై నిల్చుని చరిత్ర / పుటలపై చెరగని సంతకం చేసిన / పాత్రికేయ ప్రభాకరుడు"..అంటూ ఆ అక్షరయోధుని స్మరించుకున్నారు. ఏదేమైనా, చిన్ని నారాయణరావు 'బతుకొక ఉత్సవం' కవితా సంపుటి పాఠకుల బతుకుల్లో ఉత్సవాలు జరిగేలా ఉత్తేజాన్ని కలిగిస్తుందని, కవితా ప్రపంచంలో వినూత్న చైతన్య దీపాలు వెలిగిస్తుందని, సాహితీ చరిత్రలో విశిష్ట స్థానాన్ని పొందాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు.



**- బొగ్గరపు రాధాకృష్ణమూర్తి**
సెల్: 7981283747

### అదాని వరల్డ్ స్కూల్‌లో..

## ఆకట్టుకున్న 'గ్రాండ్ పేరెంట్స్ డే'




ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నంలో ఉన్న అదాని వరల్డ్‌స్కూల్‌లో ఈనెల 23న గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మన సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను గురించి, పెద్దవాళ్ళ గొప్పతనం గురించి పిల్లలకు అర్థమయ్యేలా అవగాహన కలిగించారు. పెద్దల మాటలే పిల్లలకు బంగారుబాటలని వివరించారు. పలువురు చిన్నారులు ఈ సందర్భంగా పెద్దల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సిరియాల ఆధ్వర్యంలో కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమంలో అనేకమంది పిల్లలు తమ అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలతో పాటు పాల్గొని సందడిచేశారు.

## వినాయక చవితి వేడుకల్లో.. విషాదం

**● వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు దుర్మరణం**

వినాయక చవితి వేడుకల్లో విషాదం నెలకొంది. జిల్లాలో జరిగిన మూడు వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. వింజమూరు మండలం శంఖవరం గ్రామంలో ఉత్సవాలు జరుగుతుండగా ఈనెల 22వ తేదీ రాత్రి వినాయకుని విగ్రహం వద్ద ఎంతో ఉత్సాహంగా డాన్స్ చేస్తున్న పట్టిబోయిన మస్తాన్(48) ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయన్ను వింజమూరులోని ఆసుపత్రికి తరలించారు. కానీ, గుండెపోటుతో అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో గ్రామస్తులు శోకతప్తులయ్యారు. ఈ దుర్ఘటనతో మస్తాన్ భార్య, ఇద్దరు పిల్లల రోదన వర్ణనాతీతం.

### గంగవరంలో...

కోవూరు మండలం గంగవరం గ్రామంలో ఈనెల 24న జరిగిన వినాయక నిమజ్జనోత్సవంలో విద్యుత్‌ఘాతానికి గురై మనోజ్‌కుమార్(21) అనే యువకుడు మృతి చెందడతో గ్రామంలో విషాదం అలుముకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు ట్రాక్టర్‌లో గంగవరం నుంచి పెన్నానదికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌కు 132 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో ట్రాక్టర్‌వద్ద ఉన్న పదిహేనుమంది యువకులు విద్యుత్‌ఘాతానికి గురయ్యారు. వీరిలో పలువురు అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయారు. వారిని వెంటనే నెల్లూరులోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. అయితే, వారిలో బీటెక్ విద్యార్థి మనోజ్‌కుమార్ మృతిచెందడం విషాదకరం.

### వీరంపల్లిలో...

వినాయకచవితి వేడుకల్లో ప్రసాదం స్వీకరించాలంటూ నలగర్ల పవన్‌కుమార్ (30) అనే భక్తుడు మైక్‌లో చెప్తుండగా, హటాత్తుగా మైక్‌లోకి విద్యుత్ సరఫరా జరగడంతో అక్కడికక్కడే కన్నుమూశాడు. మనుబోలు మండలం వీరంపల్లి గ్రామంలో ఈ దుర్ఘటన జరిగింది. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి రోదన చూసి స్థానికులు కంటతడిపెట్టారు. కుటుంబానికి పెద్దదిక్కు పవన్ చనిపోవడంతో ఆ కుటుంబం పరిస్థితి దయనీయంగా మారింది.

# పాలిచర్ల కుటుంబసభ్యులను పరామర్శించిన ఆదాల, మాగుంట



కొడవలూరు మండలం మానే గుంటపాడు గ్రామ సర్పంచ్ పాలిచర్ల శ్రీనివాసులురెడ్డి, ఆయన తల్లి పాలిచర్ల శారదమ్మల ఉత్తరక్రియలకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, నెల్లూరు రూరల్ వైకాపా ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి హాజరయ్యారు. ఈనెల 28, గురువారం నాడు మానేగుంటపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాలిచర్ల కుటుంబ సభ్యులను పరామర్శించారు. పదిరోజుల వ్యవధిలో కన్నతల్లిని, తోడబుట్టిన తమ్ముడిని కోల్పోయిన పి.వి.ప్రసన్నరెడ్డిని ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పలకరించి తమ విచారాన్ని వ్యక్తం చేశారు.

అనంతరం దివంగతులైన పాలిచర్ల శారదమ్మ, పాలిచర్ల శ్రీనివాసులురెడ్డి చిత్రపటాల వద్ద శ్రద్ధాంజలి ఘటించి, నివాళు లర్పించారు.



సెప్టెంబర్ 28వ తేదీ, గురువారం చెన్నైకి విచ్చేసిన తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డిని సత్కరించి అభినందిస్తున్న తమిళనాట తెలుగువారి ముద్దుబిడ్డ ఆచార్య సి.ఎం.కె.రెడ్డి. మధ్యలో చెన్నై టిటిడి స్థానిక సలహామండలి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి.

# గుండె సమస్యలపై అవగాహన అవసరం



గుండె సమస్యల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండడం అవసరమని, నిత్యం వ్యాయామం, మంచి జీవనశైలి ద్వారా గుండె సంబంధిత సమస్యలకు దూరంగా ఉండవచ్చునని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి సూచించారు. సెప్టెంబరు 29వ తేదీ ప్రపంచ గుండె దినోత్సవం (వరల్డ్ హార్ట్ డే) సందర్భంగా ఈనెల 28న నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌లో కన్సల్‌టెంట్ కార్డియో థొరాసిక్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ ఎస్. విజ్ఞాచరణ్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాం సతీష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా 50శాతం వరకూ గుండె వ్యాధులను నివారించడమే ప్రపంచ గుండె దినోత్సవం లక్ష్యమన్నారు. ఆహారంలో ఆకుకూరలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. రోజూ కనీసం 7 గంటలు నిద్రపోవాలని, మానసిక ఒత్తిడికి గురికాకుండా యోగా, ధ్యానం వంటివి చేయాలన్నారు. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. కనీసం ఏడాదికి ఒక్క సారైనా గుండె సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలన్నారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాం సతీష్ మాట్లాడుతూ, వరల్డ్ హార్ట్ డే సందర్భంగా అపోలో హాస్పిటల్‌లో బీపి, షుగర్, ఈసీజి పరీక్షలను పూర్తిగా ఉచితంగా చేస్తున్నట్లు తెలియజేశారు.

## విద్యుత్ చార్జీలు ఘోరం..

# ప్రజల నెత్తిన భారం

### - సిపిఎం నేత బీవీ రాఘవులు

రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న విద్యుత్ చార్జీలు ఘోరంగా, ప్రజలకు భారంగా తయారయ్యాయని, స్మార్ట్‌మీటర్లు, సంస్కరణల పేరుతో చార్జీలు పెంచడం అన్యాయమని, ప్రజలు మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలంటూ ఈనెల 27న నెల్లూరులో సిపిఎం, సిపిఐ తదితర వామపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరిగిన భారీ ర్యాలీ, అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాందోళనల్లో ఆయన పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ప్రజావ్యతిరేకంగా ఉన్నాయంటూ దుయ్యబట్టారు. విద్యుత్ సంస్థలను ప్రైవేట్‌పరం చేయడానికి ఇలా ఛార్జీలను పెంచుతున్నారని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు.

సిపిఎం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జగదీష్, జిల్లా నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, చంద్ర రాజగోపాల్, సిపిఐ నాయకులు మాలకొండయ్య, అరిగెల నాగేంద్రసాయి, షానవాజ్ తదితరులతో పాటు ఏఐటియుసి, ఎస్ఎఫ్ఐ, రైతు సంఘాల వారు, పలు వామపక్ష నాయకులు పాల్గొన్నారు.



# గురువుకి శిష్యుల పరామర్శ

### రత్నం మాష్టారుని పరామర్శించిన

## డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ రజనీకాంత్

అనారోగ్యంతో బాధపడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా చికిత్స తీసుకుంటున్న తమ గురువు, రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కే.వీ.రత్నంని గ్లోబల్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్ కలసి కుశలం తెలుసుకున్నారు. స్వల్ప చికిత్స కోసం చెన్నైలోని గ్లెనిగల్స్ గ్లోబల్ ఆసుపత్రిలో చేరిన రత్నం సార్‌ని సెప్టెంబర్ 26వ తేదీ మంగళవారం నాడు రవీంద్రనాథ్ కలిశారు. ఆయనతో పాటు కాలేయ మార్పిడిలో నిష్ణాతుడిగా ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ రజనీకాంత్ కూడా ఉన్నారు.

ఈ సందర్భంగా రత్నం మాస్టారు తన శిష్యులిద్దరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనను కంటికి రెప్పలా కాపాడుతున్న వైద్య బృందాన్ని, ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. తన శిష్యులు అంతర్జాతీయ స్థాయిలో వైద్య చికిత్సలు అందించడం తనకు గర్వకారణంగా ఉందని అన్నారు. గ్లోబల్ ఆసుపత్రికి సారథ్యం వహిస్తున్న ఇద్దరూ నెల్లూరీయులు కావడం గొప్ప విషయమని రత్నం మాస్టారు సంబరపడ్డారు.

# కోలాహలంగా.. విఎస్‌యు 14వ వార్షికోత్సవ వేడుకలు




నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం(విఎస్‌యు) 14వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల27న కోలాహలంగా జరిగాయి. విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ) ఆచార్య జి.ఎం సుందరవల్లి, జిల్లా ఎస్పీ డా.కె.తిరుమలేశ్వరరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతిని వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. యూనివర్శిటీకి న్యాక్ గుర్తింపు రావడంలో విద్యార్థుల పాత్ర ఎంతో ఉందని అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలని, విజ్ఞానాన్ని సముపార్జించుకుని దేశ పురోగతికి తోడ్పడాలని జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. అనంతరం క్రీడల్లో విజేతలకు వారు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రిజిస్ట్రార్ డా. రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌కుమార్‌బాబు పాల్గొన్నారు.

## ఉత్తరక్రియలు



కీ॥శే॥ శ్రీమతి నాదెళ్ళ అనసూయమ్మ గారు

నా భార్య, మా ఇంటి దీపం

**శ్రీమతి నాదెళ్ళ అనసూయమ్మ గారు**

తేది 17-09-2023 ఆదివారం మధ్యాహ్నం స్వర్గస్తురాలైనారు.

వారి **ఉత్తరక్రియలు :**

15వ రోజు తేది 01-10-2023 ఆదివారం ఉదయం **శిలోద్వాసన**

16వ రోజు తేది 02-10-2023 సోమవారం ఉదయం

**పొత్తర్లు, సపిండీకరణ, వైకుంఠసమారాధన**

**పంక్తి :** మధ్యాహ్నం 12.00 గంటలకు

నెల్లూరు, సండేమార్కెట్ దగ్గర, ACN బిల్డింగ్ ప్రక్కనగల మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

భర్త : **నాదెళ్ళ వెంకటరమణయ్య**

కుమారులు: **నాదెళ్ళ కృష్ణ ప్రసాద్** **నాదెళ్ళ సురేష్‌కుమార్** (SVR Samsung Digital Plaza) **నాదెళ్ళ మురళీకృష్ణ** (SVR Samsung Digital Plaza)

మరియు **కుటుంబసభ్యులు**

లాయర్
సెప్టెంబర్ 29, 2023

# మంచి జీవనశైలే.. 'గుండె'కు శ్రీరామరక్ష

ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. ముఖ్యంగా గుండె ఆరోగ్యంగా ఉంటే ఇతరత్రా ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదురైనా ఎదుర్కోవచ్చని కూడా అంటుంటారు. మనిషి హాయిగా మనుగడ సాగించాలంటే వ్యాధుల బాధలు ఉండకూడదు. అందులోనూ ఏ జబ్బూ లేకుండా గుండె ఆరోగ్యంగా ఉంటేనే పదికాలాల పాటు హాయిగా జీవించవచ్చన్నది అందరికీ తెలిసిందే. అయితే, వాస్తవానికి మన గుండెలు పదిలంగా ఉన్నాయా?.. అని ప్రశ్నించుకుంటే నీళ్ళు నమలాల్సిన పరిస్థితి. ఒక్క మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా నానాటికీ గుండెకు సంబంధించిన సమస్యలు అధికమవుతున్నాయి. ఎప్పుడు ఎవరు గుండెపోటుతో పోతారో తెలియని దుస్థితి. సాధారణంగా గుండెజబ్బులనేవి ఏ వృద్ధాప్యంలోనో, కనీసం 50 ఏళ్ళకు పైబడినవాళ్ళలోనో వస్తుంటాయి. ఇప్పుడా కాలం పోయింది. చిన్నవయసులోనే గుండెపోటు రావడం, మృత్యుఒడికి చేరిపోవడం ఎన్నో సంఘటనల్లో చూస్తూనే ఉన్నాం. పెద్దలకు, వృద్ధులకే కాదు, 20 నుంచి 30 ఏళ్ళలోపు ఉండే యువకులకు కూడా గుండెజబ్బులు వస్తున్నాయిప్పుడు. హటాత్తుగా వచ్చే గుండెపోటు (హార్ట్ స్ట్రోక్)కు నిత్యం ఎందరో బలైపోతున్నారు. దీంతో, నిన్న ఉన్నవారు.. నేడు లేరనే నిరాశ సమాజంలో పాతుకుపోతోంది. కరోనా మానవాళిని నంజుకుతినడం ప్రారంభించినప్పటినుంచీ కరోనాకి ముందు.. తరువాత కూడా ప్రాణాంతక సమస్యలు పొంచి ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రధానంగా గుండెకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి ప్రపంచ ఆరోగ్య సంస్థ, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్‌లు సంయుక్తంగా సెప్టెంబరు 29వ తేదీని ప్రపంచ గుండె దినోత్సవంగా ప్రకటించి, గుండె ఆరోగ్యం పట్ల ప్రపంచ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి.

మానవదేహంలో గుండె ఎంతో ముఖ్యమైన అవయవం. శరీరానికంతటికీ రక్తాన్ని సరఫరా చేయడం, రక్తం ద్వారా శరీరభాగాలకు ప్రాణవాయువును అందించడంలో గుండె పాత్ర ఎంతో కీలకమైనది. అందుకే గుండె ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు ఎంతో అవసరం. కానీ, సమాజంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, చిన్నచిన్న దురలవాట్లు కూడా గుండెను బాగా ప్రభావితం చేస్తున్నాయంటున్నారు నిపుణులు. ఎక్కువసేపు టీవీ చూడడం, చేతులు సరిగా శుభ్రం చేసుకోకపోవడం, మూత్రం వచ్చినప్పుడు వెంటనే టాయ్‌లెట్‌కు వెళ్ళకుండా ఎక్కువసేపు ఆపుకోవడం వంటివి కూడా క్రమేణా గుండెజబ్బులకు దారితీస్తున్నాయంటున్నారు. పొగతాగే దురలవాటు ఉంటే మాత్రం గుండె సమస్యలను కొనితెచ్చుకున్నట్లేనంటున్నారు. చక్కెరవ్యాధి (మదుమేహం) ఉంటే, దాన్ని అదుపులో ఉంచుకోవడంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఆహారంలో ఉప్పును ఎక్కువగా వేసుకోకుండా, చాలా మితంగా వాడుకోవడం కూడా ముఖ్యమేనని చెప్తున్నారు. గుండెకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించి తగు సలహాలు తీసుకోవాలే తప్ప, ఎవరో ఏదో చెప్పారనే సొంతవైద్యం చాలా ప్రమాదం కూడా. గుండెనొప్పి ఉన్నట్లు అనిపిస్తే వెంటనే ఇసిజి తీయించుకుని నిర్ధారించుకోవడంతో పాటు, గుండె స్కానింగ్ తదితర పరీక్షలు కూడా చేసుకుని అవసరమైన జాగ్రత్తలన్నీ తీసుకోవాల్సి ఉంటుంది. గుండెపోటు ప్రమాదాన్ని ముందుగానే తెలియజేసి హెచ్చరించే అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరికరం యాంజియోగ్రాం ఇప్పుడు అన్నిచోట్లా అందుబాటులోకి వచ్చింది. వైద్యుల సలహాలతోనే ఈ పరీక్ష చేయించుకోవాలి.

యువకుల్లో గుండెజబ్బులు రావడానికి ప్రధానంగా జీవనశైలే కారణమని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఆహారం పట్ల శ్రద్ధ చూపకపోవడం, కొవ్వుపదార్థాలు ఎక్కువగా తినడం, జంక్‌ఫుడ్, రెడీమేడ్ ఫుడ్‌లు ఏది కనిపిస్తే అది తినేయడం, నిద్రవేళలు సరిగా ఉండకపోవడం, శరీరానికి తగు వ్యాయామం లేకపోవడం తదితర కారణాల వల్ల గుండెజబ్బులు ఇటీవలి కాలంలో బాగా పెరుగుతున్నాయని నిపుణులు చెప్తున్నారు. ఆరోగ్యానికి నడక దివ్యౌషధమని, యోగా, ప్రాణాయామం, వ్యాయామాల ద్వారా ఒత్తిడి తగ్గించుకోవచ్చంటున్నారు. ఆరోగ్యానికి మేలుచేసే కూరగాయలు, పండ్లు, ఆకు కూరలు వాడుకోవాలని, నూనెలు తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరమని సూచిస్తున్నారు. ముఖ్యంగా యువత ధూమపానం, మాదకద్రవ్యాల వాడకం వంటి ప్రమాదకర దురలవాట్లకు దూరంగా ఉండాలి. ఎప్పటికప్పుడు గుండె ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

ఏదేమైనా.. గుండె పదిలంగా.. ఆరోగ్యంగా ఉండాలంటే.. క్రమబద్ధమైన జీవనం సాగించడమొక్కటే మార్గం. మంచి ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవనశైలే మనకు సదా రక్ష.. అదే గుండెకు.. మనకు శ్రీరామరక్ష!

**- సెప్టెంబరు 29, ప్రపంచ గుండె దినోత్సవం**

# 'రాజకీయాలు 2014 ముందు.. ఆ తరువాత' బాగుంది!

మన 'లాయర్'లో నిజాలే మాట్లాడుకుందాం అంటూ ఇటీవల ప్రారంభించిన 'సత్యపీఠం' శీర్షిక చాలా బాగుంటుంది. ముఖ్యంగా గత వారం 'ఆంధ్ర రాజకీయాలు 2014కి ముందు.. ఆ తరువాత' అంటూ విశ్లేషించిన తీరు అర్థవంతంగా ఉంది. రాష్ట్రాలలో అన్ని రాజకీయ పార్టీలూ ప్రాంతీయపార్టీలే అయినప్పుడు ఏర్పడే పరిణామాలను కళ్ళకు కట్టినట్లు వివరించారు. తమిళనాడు తరహాలో ప్రస్తుతం ఆంధ్రాలో జరుగుతున్న సంఘటనలకి అద్దంపట్టేలా 'లాయర్' వ్యాసం ఉంది. రాజకీయాలలో ఎవరూ సచ్చీలురు కాదు. ఇలా ఒకరు అధికారంలోకి వచ్చాక ఇంకొకరి లోపాలు లోడుకుంటూ పోతే.. ఎవరూ బయటమిగలరు. ఒకరు బయటుంటే ఇంకొకరు లోపలుండే సంప్రదాయం కొనసాగుతుంది. ఇది మంచి సంస్కృతి కాదు.

– వై. రత్నాకర్‌రెడ్డి, **కావలి.**




# ధన్యజీవి..డాక్టర్ రామచంద్రారెడ్డి

నెల్లూరులోని సింధూర ఆసుపత్రి వైద్యులు.. డాక్టర్ గడి రామచంద్రారెడ్డి ఇటీవల దివంగతులైన విషయం తెలిసిందే. ఆయన దేహదానం చేయడం గొప్ప విశేషం. మరణించినా, దేహదానంతో వైద్యవిద్యాభ్యాసకులకు ఉపయోగపడడం ద్వారా ఆయన ఇంకా జీవించివున్నట్లే లెక్క. ఆయన ధన్యజీవి. సింహపురిసీమలో డాక్టర్ ఇ.రాజగోపాలరెడ్డి తొలి దేహసమర్పకులు. ఆయన తర్వాత రామచంద్రారెడ్డి ద్వితీయులు. అయినప్పటికీ 2014లోనే రామచంద్రారెడ్డి తన తల్లి సీతారామమ్మ దేహాన్ని నారాయణ వైద్యకళాశాలకు దేహసమర్పణగా అందజేయడం విశేషం.

1892లో బ్రిటన్‌లో పుట్టి, లండన్ విశ్వవిద్యాలయం వైద్యకళాశాలలో ఆచార్యునిగా ఉంటూ, తన పరిశోధనలకు భారతదేశం తగినదని భావించి భారతపౌరునిగా మారిన గొప్ప వైద్యశాస్త్రవేత్త జెబిఎస్ హాల్డేన్. 1964లో ఆయన మరణించాక, తన దేహాన్ని కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాలకు సమర్పించారు. తెలుగునాట వీరిది తొలి దేహదానం అనుకోవచ్చు. వైద్యరంగంలో ఉన్నవాళ్ళు ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుంటే బావుంటుంది. డాక్టర్ రామచంద్రారెడ్డి దివ్యస్మృతికి పినాకిని దేహసమర్పకుల సంస్థ అంజలి ఘటిస్తూ, దేహసమర్పకులైన ఆ వైద్యుని కుటుంబసభ్యులకు అభినందనలు.

– తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, **పినాకిని దేహసమర్పకుల సంస్థ - నెల్లూరు.**

# కుక్కలమయంగా మాగుంట లే అవుట్!

నెల్లూరు నగరంలో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా నగర నడిబొడ్డులో ఉన్న మాగుంట లే అవుట్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఉదయం పూట వాకింగుకి వెళ్ళేవాళ్ళు తిరుమల నడకదారిలో లాగా కర్ర చేతబట్టి నడవాల్సి వస్తుంది. నగర మునిసిపల్ కార్పొరేషన్ వారు వెంటనే స్పందించి.. ఈ కుక్కలని పట్టి, కుక్కల సంరక్షణ కేంద్రాలకి తరలించాలి. ఇటీవల కాలంలో కుక్కల భారిన పడుతున్న చిన్నారుల సంఘటనలు అనేకం మనం టీవీల్లో, పత్రికలలో చూస్తూనే ఉన్నాం. అలాంటి దుర్ఘటనలు జరగక ముందే అధికారులు మేలుకుంటే మంచిది.

ఎం. రవీంద్రబాబు, **నెల్లూరు.**




# పతిపై సింపతీ కోసం.. తపిస్తున్న బాబు సతి!

స్కిల్ స్కామ్ నేరారోపణతో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు, రాజకీయ టక్కుటమార విద్యలు తెలిసిన చాణుక్యుడు, అన్నిటినీమించి నందమూరి తారక రామారావు అల్లుడు నారా చంద్రబాబునాయుడి అరెస్టు ఇప్పుడు దేశ రాజకీయాలలో చర్చించుకుంటున్న హాట్ టాపిక్. అయితే, ఆయన అరెస్టు ప్రస్తుత ఆంధ్ర రాజకీయాలపై ఏమాత్రం ప్రభావం చూపించింది...? బాబు అరెస్టుపై క్షేత్రస్థాయిలో ప్రజాస్పందన ఎలా ఉందన్నది ఇప్పుడు మనం చర్చించుకోవలసిన అంశం.

రాజకీయాలలో చంద్రబాబుది నలభై అయిదు సంవత్సరాల సీనియారిటీ. తొమ్మిదిన్నర సంవత్సరాలు ఉమ్మడి రాష్ట్రానికి, అయిదు సంవత్సరాలు విభజన ఆంధ్రాకి ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడక ముందు 1950 సంవత్సరంలో ఏప్రిల్ 20వతేదీ చిత్తూరు జిల్లాలోని మారుమూల గ్రామం నారావారిపల్లెలో ఒక సాధారణ రైతు కుటుంబంలో పుట్టారు చంద్రబాబు. కనీసం ఒక చిన్న స్కూలు కూడా లేని కుగ్రామం నారావారిపల్లె. తన ప్రాథమిక విద్య కోసం తమ ఊరి పక్కనే ఉన్న శేషాపురానికి రోజూ నడిచి వెళ్లి వచ్చేవారు చంద్రబాబు. ఆ తరువాత 9వ తరగతి కోసం చంద్రగిరికి, ఉన్నత విద్య కోసం తిరుపతికి సైకిలుపై వెళ్లిన గతం ఆయనది. తరువాత కాలంలో అదే సైకిల్‌పై ఎక్కి రాజకీయ సవారి చేస్తున్న బాబుకి ఆ సైకిల్ ఎలా వచ్చిందన్నది ఇక్కడ ప్రధాన అంశం.

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, ఆ తరువాత మాస్టర్ ఆఫ్ అకౌంట్స్ పట్టాలు పుచ్చుకున్నారు. విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు యువజన కాంగ్రెస్ పట్ల ఆకర్షితుడు కావడం, అప్పటి యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు సంజయ్‌గాంధీతో సాన్నిహిత్యం ఏర్పడడం, యూనివర్సిటీ ఎన్నికలలో చూపిన చొరవ బాబుకి యువజన నాయకుడిగా గుర్తింపు తెచ్చాయి. 1978 ప్రాంతంలో యువతకి 20శాతం సీట్లు ఇవ్వాలన్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పాలసీ పుణ్యమా అంటూ తొలిసారిగా చంద్రగిరి నియోజకవర్గం నుండి పోటీ చేసి గెలిచే అవకాశం చంద్రబాబుకి లభించింది. ఆ గెలుపే ఆయన రాజకీయ జీవితానికి అతిపెద్ద మలుపుగా మారిందనడంలో ఎలాంటి సందేహం అవసరంలేదు. ఆ గెలుపే... వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో చంద్రబాబుని 28ఏళ్ళ ప్రాయంలోనే టీ.అంజయ్య మంత్రివర్గంలో సాంకేతిక విద్య, సినిమాటోగ్రఫీ మంత్రిగా చేసింది. ఆ సినిమాటోగ్రఫీ మంత్రి పదవే బాబుని 1981, సెప్టెంబర్ 10వ తేదీన భువనేశ్వరికి పతిని చేసి నందమూరి తారక రామారావుకి అల్లుడిని చేసింది. ఆ బంధుత్వం, బంధమే చంద్రబాబుని పద్నాలుగున్నర సంవత్సరాల కాలం ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించే అవకాశాన్ని కల్పించింది.

1982లో కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెడితే, ఆ పార్టీలో చేరడానికి కూడా చంద్రబాబు ఆసక్తి చూపలేదు. పైగా, తన మామపై పోటీ చేయడానికి కూడా తాను సిద్ధం అంటూ ప్రకటించాడు. ఆ తరువాత 1983లో జరిగిన ఎన్నికలలో తన మామ సృష్టించిన ప్రభంజనంలో కొట్టుకుపోయి ఓడిపోయాడు. అనంతరం కొద్దినెలలకే మామ పంచన చేరి పార్టీలోకి చొరబడ్డాడు. ఆ తర్వాత 84లో నాదెండ్ల భాస్కరరావు సృష్టించిన సంక్షోభం నుండి మామను బయటపడేసి 31 రోజులలో మళ్ళీ రామారావుని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టడంలో చంద్రబాబు చూపిన చతురత, చాణక్యత రామారావుని ఆకర్షించింది. ఫలితంగా, పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి బాబుని వరించింది. 1989లో తెలుగుదేశం పార్టీ ఓడిపోవడం, ప్రతిపక్ష నాయకుడిగా సభకి వెళ్ళడానికి రామారావు విముఖత చూపడం, ప్రధాన ప్రతిపక్ష నేతగా చంద్రబాబు వ్యవహరించడం ఆయనకి కలిసొచ్చిన మరో అంశం. మళ్ళీ 1994లో తెలుగుదేశం అధికారంలోకి రావడంతో, 1995లో లక్ష్మీ పార్వతిని బూచిగా చూపించి, మామకి వెన్నుపోటు పొడిచి, ఆయనపై చెప్పులు వేయించి, పార్టీని లాక్కొని సైకిలెక్కి 1995 సెప్టెంబర్ 1వతేదీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టారు. అల్లుడు చేసిన ద్రోహానికి మనోవేదనతో 1996 జనవరి 18న రామారావు కన్నుమూశారు. ఇదీ గడచిన చరిత్ర, అందరికీ తెలిసిన గతం.

## ఇప్పుడు వర్తమానంలోకి వస్తే....

అప్పుడు తన కన్న తండ్రికి అవమానం జరిగితే కనీసం నోరువిప్పి మాట్లాడని బాలకృష్ణ ఇప్పుడు కూడా బావకే అండగా నిలుస్తున్నాడు. అప్పుడు భర్తని ఇదేం న్యాయం అని అడగని భార్య భువనేశ్వరి, ఇప్పుడు కూడా తన భర్తని అన్యాయంగా అరెస్టు చేశారంటూ నినదిస్తోంది. ఎప్పుడూ ఇంటి బయటకు రాని అత్తాకోడళ్ళు వీధిలోకి వచ్చారు. తన మామని అరెస్టుచేశారు, తన భర్తని అరెస్టుచేస్తారని అంటున్నారు అంటూ రామారావు మనుమరాలు బాలకృష్ణ కుమార్తె చంద్రబాబు కోడలు, లోకేష్ భార్య బ్రాహ్మణి మీడియా ముందుకొచ్చి గగ్గోలు పెడుతున్నారు. ఆ రోజు బావకు ఎదురు తిరిగి రామారావుకు అండగా నేనున్నానంటూ చైతన్యరథ సారథిగా నిలచిన నందమూరి హరికృష్ణ ఇప్పుడు జీవించి లేరు. ఆయన కుమారులు జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణరామ్‌లు బాబు అరెస్టుపై పెదవి విప్పడంలేదు. గతంలో తనకి తన భర్తకి జరిగిన అవమానాన్ని మర్చిపోయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి కూడా బాబు అరెస్టుని ఖండించారు.

## సింపతీ వచ్చిందా...?

అయితే బాబు అరెస్టుతో నారా కుటుంబానికి రావలసినంత సింపతీ వచ్చిందా..? అంటే రాలేదనే చెప్పొచ్చు. పోలీసులు చంద్రబాబుని నంద్యాలలో అదుపులోకి తీసుకుని తాడేపల్లి వరకు రోడ్డు మార్గాన తరలిస్తే ఒక చిలకలూరిపేటలో స్వల్ప ఆటంకం కలిగింది తప్ప అంతకుమించి ఉవ్వెత్తున నిరసన జ్వాలలైతే రగులుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనని వ్యతిరేకించేవారు సైతం బాబు

10లో

# చంద్రబాబు కోసం.. గొలగమూడిలో పూజలు



## వెంకయ్యస్వామికి మొక్కుకున్న సోమిరెడ్డి

తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలోనే క్షేమంగా విడుదల కావాలని కోరుకుంటూ, మాజీమంత్రి–టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈనెల 23న గొలగమూడిలోని అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామికి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో 101 టెంకాయలు కొట్టి వెంకయ్యస్వామి ఆశీస్సులు చంద్రబాబుకు ఉండాలని, అక్రమకేసులు కొట్టివేసేలా చూడాలని స్వామిని ప్రార్థించారు. అనంతరం శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలోనూ ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు 'బాబుతో నేను' కరపత్రాలను పంపిణీ చేసి, రాష్ట్ర ప్రజల కోసం జీవితం అంకితం చేసిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పట్ల వైకాపా నేతలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### కసుమూరు మస్తానయ్య దర్గాలో...

చంద్రబాబుపై పెట్టిన అక్రమకేసులు కొట్టివేయాలని కోరుకుంటూ వెంకటాచలం మండలం కసుమూరులోని ప్రసిద్ధమైన మస్తానయ్య దర్గాలో సోమిరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మస్తానయ్య స్వామివారి కంబల్ కే ఫాతెహా(దుప్పట్ల పండుగ) కావడంతో స్వామివారికి దుప్పట్లు సమర్పించి, 101 టెంకాయలు కొట్టి చంద్రబాబు విడుదల కోసం స్వామివారిని ప్రార్థించారు. ఆ తర్వాత, కసుమూరు పంచాయతీ పరిధిలోని చింతలపాలెం, షాఫాబావి, వడ్డిపాళెం గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాల వద్ద సోమిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.



## ప్యానల్ స్పీకర్‌గా ప్రసన్న

కోవూరు నియోజకవర్గ శాసనసభ్యుడు, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఈనెల 22న ప్యానల్ స్పీకర్‌గా ప్రకటించడంతో నల్లపరెడ్డి అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. శాసనసభ స్పీకర్ ఒకవేళ అందుబాటులో లేని సమయంలో ప్యానల్ స్పీకర్‌కు సభను నడిపే అవకాశం ఉంటుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో ఆ నియామకం జరిగిందని పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషపడుతున్నారు. దివంగత నేత, అసెంబ్లీ టైగర్ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తనయునిగా, ఆరుసార్లు శాసనసభ్యునిగా నిలిచి గెలిచిన నాయకునిగా నల్లపరెడ్డి ప్రసన్న రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. కోవూరు ఎమ్మెల్యేగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రసన్న లక్ష గడపలు తిరిగి తనకు తనే సాటి అనిపించుకుంటున్నారు.

## శ్రీసిటీలో అక్టోబర్ నుంచి..

# శ్రీ రామచంద్ర ఆసుపత్రి వైద్య సేవలు




అనేక బహుళజాతి కంపెనీలకు నిలయమై అంతర్జాతీయ ఖ్యాతిపొందిన శ్రీసిటీ ప్రాంగణంలో అత్యున్నత ఆరోగ్య వైద్య సేవలను అందించడానికి చెన్నైలోని శ్రీ రామచంద్ర ఆసుపత్రి వారితో శ్రీసిటీ ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వైద్య కేంద్రంలో 24 గంటలూ డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. అత్యవసర చికిత్సలు, యాక్సిడెంట్లతో పాటు పరిశ్రమలలో ప్రమాదాలకు సంబంధించి కూడా సత్వర వైద్య సేవలు అందించేందుకు ఈ ఆసుపత్రి సిద్ధమవుతోంది. శ్రీసిటీలో శ్రీ రామచంద్ర ఆసుపత్రి వైద్య సేవలు అక్టోబర్ మూడో వారం నుంచి ప్రారంభం అయ్యేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీ రామచంద్ర విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వి.ఆర్.వెంకటాచలం అవగాహన ఒప్పంద (ఎంఓయు) పత్రాలను మార్చుకున్నారు. శ్రీ రామచంద్ర హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.బి.సుదాగర్ సింగ్, ప్రో–ఛాన్సలర్ ఆర్.వి.సెంగుతువాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, చెన్నైలోని అత్యుత్తమ ఆసుపత్రుల్లో ఇది ఒకటని, శ్రీసిటీకి మాత్రమే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కూడా ఈ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## అరుదైన వక్త, ఆధ్యాత్మిక సాహితీవేత్త...

# అగస్త్యరెడ్డి వెంకురెడ్డి.. అస్తమయం



**నెల్లూరు టౌన్‌హాలుకు వెళ్లినప్పుడల్లా చిరునవ్వుతో పలకరించే వ్యక్తి, తేటతెనుగులో స్వచ్ఛంగా మాట్లాడుతూ, ఎంతటి పెద్ద సభలోనైనా తడుము కోకుండా అనర్గళంగా మాట్లాడే మంచి వక్త.. అధివక్త.. సుప్రసిద్ధ సాహితీవేత్త అగస్త్యరెడ్డి వెంకురెడ్డి..ఇక లేరనే మాటను జీర్ణించుకోవడం కష్టమే. ఆయన లేకపోవడం అటు టౌన్‌హాలు–వర్ధమాన సమాజానికి, ఇటు నెల్లూరు సారస్వత లోకానికి పెద్దలోటు. గత కొంతకాలంగా ఆయన అస్వస్థతకుగురై ఈనెల 22న పరమపదించారు. నెల్లూరులోని పలు సాహితీసంఘాలకు పెద్దదిక్కుగా ఉంటూ, ఎన్నో సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలను అలవోకగా ఒంటిచేత్తో నిర్వహించి అందరి మన్ననలందుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆయన. అలాంటి అరుదైన సాహితీవేత్త అస్తమయం సాహితీకారులకు, సాహిత్యాభిమానులకు ఆవేదన మిగిలించింది.**










అగస్త్యరెడ్డి వెంకురెడ్డి.. అంటేనే గలగలపారే ఒక సాహితీస్రవంతి. జలపాతంలా జాలువారే ఆయన ఉపన్యాసధారల్లో తడిసినవారికి ఆ యథార్థం బోధపడుతుంది. మహాభారతంలోని పలు అంశాలపై, తిక్కన కవితారీతులపై ఆయన ప్రసంగాలు ఎంత అద్భుతమో వినవలసిందే కానీ, ఆ భాషా పటిమ చెప్పనలవి కాదు. ఓసారి మహాకవి తిక్కన గురించి చెప్తూ, 'ఆ మహనీయుడెంతటి మహాకవియో, అంతటి మహాపండితుడు. ఎంతటి తత్త్వ మూర్తియో అంతటి లోకజ్ఞుడు. ఎంతటి ప్రతిభాశాలియో అంతటి వ్యుత్పన్నుడు. రాజకీయవేత్త. మంత్రిసత్తముడు, దండనాథుడు, బహుముఖ మేధావి..ఆయనో మహాస్రష్ట..మహాద్రష్ట' అంటూ గంటన్నరపాటు ఏకధాటిగా ఉపన్యసించి అందరి కరతాళధ్వనులందుకున్నారు.

ఆ భాషావైదుష్యం అగస్త్యరెడ్డికి పుట్టుకతో అబ్బిన విద్య. ఎందుకంటే, ఆయనో నిరంతర అధ్యయనశీలి. భారత రామాయణాలను ఔపోసన పట్టిన ఆధ్యాత్మికవేత్త. నెల్లూరు కళా, సాహితీరంగాలు, చరిత్రకు సంబంధించి వర్ధమాన కవులు, పరిశోధకులకు ఏ సందేహం వచ్చినా తీర్చగలిగే సత్తా ఉన్న ప్రతిభావంతులాయన. స్వతహాగా మంచి కవి, అందులోనూ చిన్నతనం నుంచి పద్యం మీద పట్టుసాధించి, ఎన్నో హృద్యమైన పద్యాలు రచించి పాఠకలోకాన్ని మెప్పించిన సాహితీమూర్తి వెంకురెడ్డి.

### వర్ధమాన సమాజానికి విశిష్ట సేవలు :

అగస్త్యరెడ్డి వెంకురెడ్డి స్వస్థలం నెల్లూరు జిల్లాలోని తోటపల్లిగూడూరు మండలం ఈదూరు. 1939లో రాజమ్మ–కాశిరెడ్డి దంపతుల పుణ్యాలపంటగా పుట్టారు. పెరిగింది, పలక పట్టింది అంతా పక్కనే ఉన్న వరకవిపూడిలోనే. ఆ తర్వాత, ముత్తుకూరు బోర్డుహైస్కూల్‌లో పది దాకా చదువుకుని, నెల్లూరు విఆర్‌కాలేజీలో ఇంటర్ పూర్తిచేసి, అనంతరం నాగపూర్ యూనివర్శిటీలో ఎంఏ., ఎల్‌ఎల్‌బి పట్టాలందుకున్నారు. రెవెన్యూశాఖలో కొంతకాలం ప్రొబేషనరీ డెప్యూటి కలెక్టర్‌గా, ఆ తర్వాత హైదరాబాద్, నెల్లూరుల్లో న్యాయవాదిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. చిన్ననాటి నుంచి సాహిత్యం మీద మక్కువ ఎక్కువ కనుక, నెల్లూరుకు వచ్చాక ఆ సారస్వతాభిలాష ఆయన్ను టౌన్‌హాలు వద్దకు నడిపించింది. ఎంతో విశిష్టమైన 'వర్ధమాన సమాజం' గ్రంథాలయానికి కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా, అధ్యక్షులుగా నాలుగు దశాబ్దాలపాటు అనితరసాధ్యమైన సేవలందించిన ఘనత ఒక్క అగస్త్యరెడ్డి వెంకురెడ్డికే దక్కింది. అదే సందర్భంలో, నెల్లూరు టౌన్‌హాలు (పురమందిరం) కార్యదర్శిగా కూడా ఆయన పుష్కరకాలం పనిచేయడం ఆయన కార్యదీక్షాదక్షతకు ప్రతీక. తిక్కన విజ్ఞానకేంద్రం వ్యవస్థాపక కార్యదర్శిగా.. ఉపాధ్యక్షులుగా, కవికోకిల దువ్వూరు రామిరెడ్డి విజ్ఞానసమితి వ్యవస్థాపక కార్యదర్శిగా అపురూపమైన సేవలందించారు. నెల్లూరు వినియోగదారుల సంఘానికి పలు హోదాల్లోనూ, ఇంటర్నేషనల్ ఆయుర్వేదిక్ డెవలప్‌మెంట్ సొసైటీకి వ్యవస్థాపక అధ్యక్షులుగానూ ఆయా సంఘాల అభ్యున్నతికి అవిరళ కృషిచేశారు. ఇంకా అనేకానేక సారస్వత, కళా సంఘాలకు సారథిగా, వారధిగా పలు సంఘాల ఆవిర్భావానికి కారకులుగా, ప్రేరకులుగా కూడా ఆయన అవిశ్రాంతంగా పనిచేశారు.

### 'గీతాసుధాలహరి' కర్తగా...

భగవద్గీతకు ఆంధ్రపద్యాను కృతిగా అగస్త్యరెడ్డి వెంకురెడ్డి రచన 'గీతాసుధాలహరి' ఆయన పద్య రచనాప్రతిభకు గీటురాయి. 1980లో ఆయన ఆ గ్రంథాన్ని ముద్రించారు. దాదాపు 270 పేజీలున్న ఆ పుస్తకంలో అర్జున విషాదయోగం నుంచి మోక్ష సన్యాస యోగం, భగవద్గీతా మహాత్మ్యం వరకు.. ఒకపేజీలో సంస్కృత శ్లోకాలు, పక్కపేజీలో అవి అందరికీ సుబోధకమయ్యేవిధంగా ఆయన రచించిన తెలుగు పద్యాలు ఒక్కొక్కటీ ఒక్కో ఆణిముత్యమనే చెప్పవచ్చు. ఆ ఒక్క గ్రంథం చాలు ఆయన పద్య కవితావైదుష్యం ఎంత గొప్పదో చెప్పడానికి. చిన్నతనంలోనే, అంటే పన్నెండేళ్ళ వయసులోనే ఆయన ఇంటర్ చదువుతున్న రోజుల్లోనే..(1956లో)...

*జన్మభూమి కన్న స్వర్గంబు వేరేది?*
*మాతృభాష కంటె మధురమేది?*
*కన్నతల్లి కంటె ఘనదైవమింకేది?*
***తెలియుమయ్య దీని తెలుగుబిడ్డ!...*** అంటూ ఆయన రచించిన 'తెలుగుబిడ్డ' శతకం ఒక అద్భుతం. ఈ నీతిశతకం ఒక జాతిరత్నంగా ప్రకాశిస్తుందని సాహితీవాచస్పతి మొవ్వ వృషాద్రిపతి ఆ శతకానికి రాసిన 'ప్రాబల్లు'లో కితాబునిచ్చారు కూడా.

ఆ తర్వాత 2013లో మరో అపూర్వమైన భక్తి శతకం 'షాణ్మాతురస్తవం' ఆయన కలం నుంచి జాలువారింది. తన ఉపాస్య దైవమైన శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని కీర్తిస్తూ 'నిరతానంద, నిరామయా, నిరుపమా, నిర్ద్వంద, నిర్మోహనా/ నిరహంకార, నితాంతభూరివిభవా, నిర్వాణసంధాయకా/నిరవద్యా, నిగమాత్మ, నిష్కలుష, నిర్నిద్రప్రభావోదయా/ పరిరక్షింపవె, భకవత్సల, దయాపారీణ, షాణ్మాతురా!.. అంటూ అచంచలభక్తితో రచించిన శతకం ఆయనకు మరింత ఖ్యాతిని తెచ్చింది. ఏదేమైనప్పటికీ, సాహితీ రంగంలో ఎనలేని ప్రఖ్యాతిని సంపాదించుకున్న అగస్త్యరెడ్డి వెంకురెడ్డి భౌతికంగా లేకపోయినా.. ఆయన రచించిన 'గీతాసుధాలహరి' ఆయన్ను చిరంజీవిని చేసింది. అందులో ఆయనే చెప్పుకున్నట్లుగా.. 'వాస్తవమ్ముగ పదివేల వత్సరములు /చంద్ర లోకమ్ము జేరి వాసమ్ము సేయు/గీతల, పఠించు తరి మిత్తివాతబడిన/యతడు నిజముగ దేవత్వమంద గలడు'..(పేజీ 267) అన్నట్లుగానే... తాను కోరుకున్న ఆ పరమపదాన్ని ఆయన చేరుకుంటారనే ఆశిద్దాం!...

# నెల్లూరు కబుర్లు



## శివాజిసెంటర్‌లో వేడుకగా వినాయక చవితి

○ పాల్గొన్న దీపా వెంకట్

నెల్లూరు ట్రంకు రోడ్డులోని శివాజీ సెంటర్‌లో వినాయక చవితి వేడుకులు అంగరంగవైభవంగా జరిగాయి. శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం వద్ద నెలకొల్పిన గణనాథుని విగ్రహాన్ని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్, 'సేవాదీపం' దీపా వెంకట్ ఈనెల 23న సందర్శించారు. బీజేపీ నాయకులు వాకాటి నారాయణరెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిలతో కలిసి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన అనంతరం వేడుకగా శోభాయాత్రను ప్రారంభించారు. ఆ తర్వాత జరిగిన గణేష్ నిమజ్జనోత్సవాల్లోనూ ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివాజీ సెంటర్‌లో గణేష్ లడ్డు ప్రసాదాన్ని వేలంవేయగా నెల్లూరులోని స్టార్‌ఆగ్రో మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వల్లూరు మధు సూదన్‌రెడ్డి 96 వేల రూపాయలకు సొంతం చేసుకుని నిర్వాహకుల సత్కారం అందుకున్నారు. శివాజీ సెంటర్ ప్రతినిధులు, బీజేపీ నాయకులు పి.సురేంద్రరెడ్డి, కేవీ సుబ్రహ్మణ్యం, పేటేటి భాస్కర్, నాగరాజురెడ్డి, ఏబీవీపీ పూర్వ విద్యార్థులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అంతర్‌జిల్లాల పోటీలకు.. జిల్లా సాఫ్ట్‌బాల్ జట్లు



త్వరలో జరగనున్న 10వ సీనియర్ అంతర్‌జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్లను సిద్ధం చేశారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మలిరెడ్డి కోటారెడ్డి, సిహెచ్ కామేశ్వరిల పర్యవేక్షణలో ఈనెల 24న ఎంపికలు జరిగాయి.



## అక్టోబరు 15 నుంచి.. దేవీ శరన్నవరాత్రులు

○ ముస్తాబవుతున్న శ్రీరాజరాజేశ్వరి దేవాలయం

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని అక్టోబరు 15 నుంచి 23వ తేది వరకు శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహించేందుకు నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవాలయం నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. ఆమేరకు ఈనెల 24న ఆలయంలో స్తంభ ప్రతిష్ఠ, ప్రత్యేకపూజలు చేశారు. నగర మేయర్ పోట్లూరి స్రవంతి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, శ్రీ రాజరాజేశ్వరిదేవి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి తదితరులు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. 49వ శరన్నవరాత్రుల సందర్భంగా అక్టోబర్ నెలలో మాలధారణ కార్యక్రమం కూడా ప్రారంభమవుతుందని చెప్పారు. అమ్మవారి ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, దేవస్థానం ఇఓ శ్రీనివాసులురెడ్డి, ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ రత్నం జయరామ్, 28వ డివిజన్ ఇన్‌చార్జి నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, సయ్యద్ మొబీనా, పేర్నాటి కోటేశ్వరరెడ్డి, ఏసునాయుడు, హరిబాబుయాదవ్, వేలూరు శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి, షేక్ రియాజ్, సిహెచ్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సాయిదర్బార్ నుంచి.. షిరిడీకి యాత్ర



నెల్లూరు బాలాజీనగర్ సాయిదర్బార్ అద్దాల మందిరం నుంచి సుమారు 500 మందికి పైగా సాయిభక్తులు ఈనెల 24న షిర్డీకి యాత్రగా బయలుదేరారు. ఇరుముడులు కట్టుకుని, సాయినాథుని చిత్రాలను చేతపట్టి, సాయి నామోచ్ఛారణలతో నగరంలో పాదయాత్ర చేసి రైల్వేస్టేషన్‌కు వెళ్ళారు. అక్కడినుంచి షిరిడీకి వెళ్లి సాయినాథుని దర్శించుకుంటామని, గత 23 సంవత్సరాలుగా ప్రతిఏటా ఇలా మాలధారణ చేసి దీక్ష చేపట్టిన భక్తులతో కలిసి షిరిడీ యాత్ర చేస్తున్నామని మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి తెలిపారు.

## అథ్లెటిక్స్‌లో డా.కిషోర్స్ రత్నం విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వారు ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం విద్యార్థులు సత్తా చాటుకున్నారు. వందమీటర్ల పరుగుపందెంలో 9వ తరగతి విద్యార్థి టి.మునివర్షిత్ ప్రథమస్థానం సాధించగా, 10వ తరగతి విద్యార్థులు పి.దేవేష్, పి.దేవహర్షిత్‌రెడ్డి, ఎస్‌పి ఉజ్వల్ ప్రణవ్, టి.ఈనోష్, ఆర్‌పి భగవత్‌లు షాట్‌పుట్, లాంగ్‌జంప్, రన్నింగ్‌రేస్‌లలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు ఆ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామమూర్తి నాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, ప్రపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఖాదీబోర్డు డెప్యూటీ డైరెక్టర్‌గా.. ప్రసన్నలక్ష్మి



జిల్లా ఖాదీబోర్డు డెప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా ఒంగోలు పరిశ్రమలశాఖ డీడీగా పనిచేస్తున్న పి.ప్రసన్నలక్ష్మిని నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు తాజాగా ఉత్తర్వులిచ్చారు. ప్రసన్నలక్ష్మి ఆమేరకు నెల్లూరులో ఇటీవల బాధ్యతలు తీసుకున్నారు.

## కావ్యశ్రీకి..జేసీ అభినందన



ప్రముఖ యోగా క్రీడాకారిణి, నెల్లూరుకు చెందిన కావ్యశ్రీని ఈనెల 25న జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ అభినందించారు. థాయిలాండ్‌లో జరిగిన ఏషియన్ పసిఫిక్ ఇంటర్నేషనల్ యోగా పోటీల్లో మనదేశం తరఫున పాల్గొని బంగారు పతకం సాధించడం పట్ల జేసీ సంతోషం వ్యక్తం చేశారు. ఆమె వెంట కోచ్ రవీంద్ర తదితరులున్నారు.

## 'తంగిరాల మహాభారతం' 74వ భాగం




ధృతరాష్ట్రుడు ఒకరోజు విదురుని పిలిచి శకుని, దుర్యోధనల కోరిక చెప్పినప్పుడు విదురుడు నిర్ఘాంతపోయి, దీనివలన కురు, పాండవుల మధ్య కలహాలు వస్తాయని, అందువలన వారి తండ్రి అయిన నువ్వు నచ్చజెప్పమంటాడు. ఇంకొకసారి దుర్యోధనుడికి నచ్చజెప్పాలని ధృతరాష్ట్రుడు ప్రయత్నించినా, ఆయన ఒప్పుకోడు. తనకు మయసభలో జరిగిన అవమానాన్ని చెప్పి పాండవుల ఐశ్వర్యం లాక్కునేందుకు ఇంతకన్నా మంచి మార్గం లేదని, అప్పటిదాకా తన హృదయతాపం తీరదని దృఢంగా చెబుతాడు. చిట్టచివరకు ధృతరాష్ట్రుడు పుత్రాభిమానంతో విదురుని పిలిచి పాండవులను తోడుకొని వచ్చి, వాళ్ళు నూతన భవనాన్ని తిలకించి, ధర్మరాజు సరదాగా దుర్యోధన కుమారులతో స్నేహ జూదమాడి వినోదించమని, వెంటనే ఇంద్రప్రస్థ నగరానికి వెళ్ళమని శాసిస్తాడు. విదురుడు మారుమాటాడక ధర్మరాజు దగ్గరికి వెళ్లి ఆహ్వానించినప్పుడు... ధర్మరాజు జూదంలో ఆవేశాలతో కలహాలు ఏర్పడతాయని తన అభ్యంతరం చెబుతాడు. అయినా ధృతరాష్ట్రుని ఆజ్ఞను సారం సోదరులు, ద్రౌపది, ధౌమ్య మునితో కలిసి విదురుని తోటి హస్తినాపురానికి బయలుదేరుతాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




## వేడుకగా... వేదాంతదేశికర్ ఉత్సవాలు



నెల్లూరు రంగనాయకుల పేట గోపురంవీధిలో ఉన్న సుప్రసిద్ధమైన శ్రీ వేదాంతదేశికర్ దేవస్థానంలో ఆదివణ్ శఠగోప యతీంద్ర మహాదేశికుల 755వ తిరునక్షత్ర ఉత్సవాలు భారీగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 25న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, శ్వేతఛత్ర పల్లకిసేవలు కన్నులపండువగా నిర్వహించారు. పినాకినీ నదీ తీర్థంతో వేదాంతదేశికర్, యతీంద్ర మహాదేశికులకు అభిషేకాలు చేసి స్నపన తిరుమంజనం చేపట్టారు. ఆనంతరం ఆలయంలో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి శేషవాహనసేవ, వేదాంత దేశికులకు పల్లకిసేవ, శాత్తుమొఱై నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు విజయసారథి భట్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజాకార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు కేసీ వరదరాజన్, నేలటూరు బాలాజీ, రమేష్, బండేపల్లి రాజగోపాల్ పాల్గొన్నారు.

## వియానిహోమ్‌లో ఉచిత వైద్య శిబిరం

నెల్లూరులోని డైకస్ రోడ్డు సెంటర్‌లో ఉన్న వియానీ హోమ్‌లో ఇటీవల శ్రీవత్స చెస్ట్ అండ్ చిల్డ్రన్స్ క్లినిక్ మరియు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.చిరంజీవి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. వియానీహోమ్‌లోని పిల్లలకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు డాక్టర్ కే.కళ్యాణి తదితరులు పాల్గొని పిల్లలకు స్వీట్స్, బిస్కెట్స్, స్నాక్స్ పంపిణీ చేశారు. విశ్రాంత ఏఎస్ఐ షేక్ మహబూబ్ బాషా, పిఎంపి గౌరవాధ్యక్షులు జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, వియానిహోమ్ నిర్వాహకురాలు రమా సిస్టర్ తదితరులు పాల్గొన్నారు.

# మాట తప్పని సీఎం.. జగన్!

## - కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న



మాట తప్పకుండా, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తూ, రాష్ట్రాభివృద్ధికి -ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని, ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న చుక్కల భూముల సమస్యలను పరిష్కరించి రైతులెందరికో మేలుచేసిన సీఎం జగన్ పట్ల ప్రజల్లో అభిమానం పెరుగుతోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 23న కొడవలూరు మండలంలోని యల్లాయపాళెంలో 620 మంది రైతులకు సంపూర్ణ హక్కులతో పట్టాదారు పాస్‌పుస్తకాలను ఎమ్మెల్యే ప్రసన్న పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్యాత్మకంగా ఉన్న చుక్కల భూముల జాబితా లోని సుమారు 2.06 లక్షల ఎకరాలను రైతులకు పైసా ఖర్చులేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగేపని లేకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే 2673 ఎకరాల భూములను చుక్కలభూముల జాబితా నుంచి తొలగించి రైతులకు కానుకగా ఇచ్చారన్నారు. డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, డీఎల్‌డివై ఛైర్మెన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైకాపా మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఇసనాక సునీల్‌రెడ్డి, అడపాల మోహనకృష్ణ, వెంకట రమణారెడ్డి, రాజేష్‌రెడ్డి, ఎస్‌కె మహబూబ్ బాషా, సమీవుద్దీన్, సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





# జాతరకి రండి.. - సీఎంని ఆహ్వానించిన రామ్

అక్టోబర్ 4, 5 తేదీల్లో జరగనున్న వెంకటగిరి పోలేరమ్మ జాతరకు రావాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, కమ్యూనిటి డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆహ్వానించారు. ఇటీవల అసెంబ్లీలో సి.ఎంని కలిసిన రామ్, పోలేరమ్మ జాతరని రాష్ట్ర పండుగగా జగన్ ప్రకటించిన అనంతరం జరుగనున్న తొలి జాతరకు ఆయనను రావలసిందిగా పిలిచారు. ఈ సందర్భంగా పట్టువస్త్రాలతో పాటు ఆహ్వానపత్రిక, అమ్మవారి చిత్రపటాన్ని ముఖ్యమంత్రికి రామ్‌కుమార్ అందజేశారు.

# శ్రీసిటీ ప్రగతి అద్భుతం

## జెఎస్‌డబ్ల్యు గ్రూప్ ఛైర్మెన్ సజ్జన్ జిందాల్



శ్రీసిటీలోని క్రియా యూనివర్శిటీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు, జెఎస్‌డబ్ల్యు గ్రూప్ ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, భారతీయ స్టీల్ టైకూన్ సజ్జన్ జిందాల్ ఈనెల 23న శ్రీసిటీని సందర్శించారు. క్రియా యూనివర్సిటీ ఆవరణలో కొత్తగా నిర్మించిన జెఎస్‌డబ్ల్యు అకడమిక్ బ్లాక్ ప్రారంభోత్సవానికి ఆయన వచ్చారు. యూనివర్సిటీ ఛాన్సలర్ ఎన్.వఘుల్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలరావు, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన భవనం ప్రారంభోత్సవం అనంతరం ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ, క్రియా సంస్థను ఇంత అద్భుతమైన రూపంలో చూడటం, సమాజానికి ప్రయోజనకరమైన వందలాది యువకులను తీర్చిదిద్దడం సంతోషంగా ఉందని, క్రియా పురోగతికి తమవంతు సహకరిస్తామని చెప్పారు. దేశంలోని అగ్రశ్రేణి పారిశ్రామిక పార్కుల్లో ఒకటిగా శ్రీసిటీ వేగంగా అభివృద్ధి చెందడం పట్ల జిందాల్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. శ్రీసిటీ యాజమాన్యం కూడా యూనివర్సిటీ క్యాంపస్ కోసం విశాలమైన స్థలాన్ని ఉదారంగా కేటాయించిందని, జిందాల్ వంటి దాతల నిరంతర సహకారంతో ఈ సంస్థ నలంద, తక్షశిలతో పోల్చదగిన, దేశంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందుతుందని యూనివర్సిటీ ఛాన్సలర్ వాఘుల్ అభిప్రాయపడ్డారు. అనంతరం శ్రీసిటీని సందర్శించినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి జిందాల్‌కు అభినందనలు తెలియజేస్తూ, 2009లో జిందాల్ నేతృత్వంలోని అసోచామ్ ప్రతినిధి బృందం జపాన్‌కు వెళ్లిన సందర్భంగా వారి అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి వచ్చి, అద్భుతమైన భవనాన్ని విరాళంగా ఇచ్చినందుకు సజ్జన్ జిందాల్‌కు, శ్రీమతి సంగీతా జిందాల్‌కు క్రియా వీసీ ప్రొఫెసర్ నిర్మలరావు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీసిటీకి మరో విశిష్ట గుర్తింపు

## ఎకనామిక్ టైమ్స్ ఎడ్జ్ 'ఐకానిక్ బ్రాండ్ ఆఫ్ ఇండియా' అవార్డు



శ్రీసిటీకి జాతీయస్థాయిలో మరో విశిష్ట గుర్తింపు లభించింది. ఎకనామిక్ టైమ్స్ ఎడ్జ్ 'ఐకానిక్ బ్రాండ్ ఆఫ్ ఇండియా-2023' అవార్డు శ్రీసిటీని వరించింది. ఈ నెల 25వ తేదీ ముంబైలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ కాన్‌క్లేవ్ 6వ ఎడిషన్‌లో 2023 సంవత్సరానికి ఈ అవార్డును శ్రీసిటీ సాధించింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మాజీ శాస్త్రవేత్త, చంద్రయాన్-1 ప్రాజెక్ట్ సారథి డాక్టర్ మైల్‌స్వామి అన్నాదురై, శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్‌కు ఆ ట్రోఫీని అందజేశారు. అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించిన విశిష్ట భారతీయ బ్రాండ్‌గా హోదా దక్కించుకున్నందుకు న్యాయమూర్తుల ప్యానెల్ శ్రీసిటీని అవార్డు గ్రహీతగా ఎంపిక చేసింది.

# అలరించిన..'ప్రాసమణి' పద ప్రవాహం

## మంత్రముగ్ధులైన ప్రేక్షకులు



శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో ఈనెల 23న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వద్ద జరిగిన సాహిత్య కార్యక్రమం ఆద్యంతం జనరంజకంగా ఉండి అందరినీ అలరించింది. 'ప్రాసమణి'గా ప్రసిద్ధిగాంచిన అన్నదాత మణి పద ప్రవాహ ప్రదర్శన ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. 'ప్రకృతి ఒడిలో పరిశ్రమలు' అనే అంశంపై పాటలు, పద్యాలు, ఛలోక్తులతో, ప్రాసలతో ఆగకుండా ఆయన చేసిన అద్భుత ప్రసంగానికి ప్రేక్షకులు మంత్రముగ్ధులైపోయారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రాసమణిని అభినందిస్తూ, సాహిత్యంతో పాటు 'నవ్వే ఔషధం' కనుక హాస్యరసస్ఫోరకంగా ఉండేలా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వివేకవంతమైన పదజాలం, ఉల్లాసమైన భావజాలం, ఆకర్షణీయమైన అనుకరణలు, ప్రాసలతో ప్రేక్షకులను ఆకర్షించిన ప్రాస మణి చతురత అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసిందన్నారు. ఈ సందర్భంగా, చిత్రలేఖనంలో అపూర్వమైన ప్రతిభ కనబరిచిన స్థానిక అకార్డ్ స్కూల్‌కు చెందిన త్రిపురాంతకం ప్రియాసుదర్శిని(10వ తరగతి విద్యార్థిని)ని డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సన్మానించి జ్ఞాపికను బహుకరించారు.



# న్యూఢిల్లీలో.. బీసీల సమావేశంలో బీఎంఆర్

ఈనెల 22న న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో జరిగిన బీసీల మేధావుల సదస్సులో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) పాల్గొన్నారు. పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టడం, జనగణనలో బీసి కుల గణన జరిపించడం, కేంద్ర ప్రభుత్వంలో బీసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడం తదితర అంశాలను ఈ సమావేశంలో చర్చించారు. సీనియర్ బీసీ నాయకులు వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్యతో పాటు వివిధ రాష్ట్రాల నుండి అనేకమంది నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# గణపయ్యకు 101 రకాల ప్రసాదాలు



వినాయక చవితి సందర్భంగా బోగోలులో ఏర్పాటు చేసిన గణపయ్యకు భక్తులంతా కలసి ఈనెల 24న 101 ప్రసాదాలను తయారుచేయించి భక్తితో స్వామికి సమర్పించుకున్నారు ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి నిమజ్జనోత్సవం సందర్భంగా పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎస్ఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటుచేశారు.





## ఎన్‌బికెఆర్‌లో ప్రాంగణ ఎంపికలకు పరీక్షలు


కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల బెంగుళూరుకు చెందిన ఎలక్ట్రికల్ సంస్థ ఎం.కోర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఎన్‌బికెఆర్‌లో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఇఇఇ, ఇసిఇ విద్యార్థులతో వారు మాట్లాడుతూ, తమ కోర్ కంపెనీలో పనిచేయడం వల్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో సమానంగా వేతనం ఉంటుందని, తక్కువ వత్తిడితో ఎక్కువ కాలం పనిచేసే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. అదేవిధంగా దేశ ఉత్పాదకతను కూడా పెంచవచ్చన్నారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన 198 మంది విద్యార్థులను ఎంపిక చేసు కునేందుకు తొలుత ఆఫ్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటామన్నారు. కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎన్ కిషొంధర్, శిక్షణా సిబ్బంది, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

## ‘వందే భారత్’ రైలుకు స్వాగతం



తొమ్మిది ‘వందే భారత్’ రైళ్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లాంఛనంగా ప్రారంభించగా, అందులో విజయవాడ-చెన్నై మధ్య నడిచే ‘వందే భారత్’ రైలు ఆదివారం గూడూరు రైల్వే జంక్షన్‌కు చేరుకుంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఎస్.ఎస్.వెంకటేశ్వరరావులు వందేభారత్ ప్రయాణీకులతో ముచ్చటించారు. విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బీజేపీ పట్టణ అధ్యక్షులు బాలకృష్ణంనాయుడు, నాయకులు పురుషోత్తంరెడ్డి, చందురెడ్డి, ఎస్.ఎస్.నాయుడు, మయూరి శ్యాంయాదవ్, రైల్వే అధికారులు పాల్గొన్నారు. కాగా, వందేభారత్ రైళ్లకు అటు నెల్లూరు ఇటు రేణిగుంటలలో స్టాపింగ్ అవకాశం కల్పించి, రైల్వే జంక్షన్ అయిన గూడూరులో స్టాపింగ్ ఇవ్వకపోవడంపై స్థానికంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




### తెలుగు భాషాభివృద్ధి కమిటీ సభ్యునిగా

## ఎమ్మెల్సీ మురళీధర్



శాసన మండలిలో 2023-24 సంవత్సరానికి గాను తెలుగు భాష మరియు సాంస్కృతిక కమిటీకి సభ్యునిగా నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ని నియమిస్తూ ఇటీవల శాసన మండలి ఛైర్మెన్ కొయ్య మోహన్‌రాజు వ్రాతపూర్వక ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కమిటీకి ఛైర్మెన్‌గా మండలి ఛైర్మెన్ మోహన్‌రాజు వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురళీధర్ మాట్లాడుతూ ఈ కమిటీలో సభ్యునిగా నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మండలి ఛైర్మెన్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నానని, తెలుగు భాష మరియు సాంస్కృతిక అభివృద్ధికి కృషిచేస్తానని ఆయన తెలిపారు.

### రాష్ట్ర పోటీలకు

## ప్రాస్పరో విద్యార్థులు



నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వరకూ నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీలలో అండర్ 17 షటిల్ బాడ్మింటన్ బాలికల విభాగంలో గూడూరు ప్రాస్పరో స్కూల్‌కు చెందిన లక్ష్మీప్రియ, అంషద్ ఫర్వీన్ జట్టు ఫైనల్స్‌లో గెలుపొంది వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రాస్పరో స్కూల్ డైరెక్టర్ దశరథరామిరెడ్డి, ప్రిన్సిపల్ ఆంటోని, హెచ్డీ ఎరినా ఇండోర్ స్టేడియం నిర్వాహకులు, కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి, వైజీఎస్బీఏ సభ్యులు ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

### పారిశుధ్య కార్మికులను

## పర్మినెంట్ చేయాలి

**■ సి.ఐ.టి.యు డిమాండ్ ■**

ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు అనుబంధం) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఇటీవల గూడూరులోని మాయాబజార్‌లోని సి.ఐ.టి.యు కార్యాలయం నుండి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ర్యాలీగా బయలుదేరి ముత్యాలపేట మీదుగా ఆర్డీవో ఆఫీసుకు చేరుకుని దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు అందరికీ న్యాయం జరిగేలా చేయాలని వారు డిమాండ్ చేశారు. జోగి శివకుమార్, దారా కోటేశ్వరరావు, బి.ప్రభావతి, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, ఏ.ప్రసాద్, పి.శంకరయ్య, జి.మధు, బి.పెంచలప్రసాద్. ఆర్.సుబ్బమ్మ, కె.నారాయణమ్మ, సుబ్బరామమ్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా సంస్థలకు..
# శ్రీసిటీ పరిశ్రమల చేయూత



శ్రీసిటీ పరిసర ప్రాంతాల ప్రభుత్వ విద్యాసంస్థలలో నాణ్యమైన, అధునాతన విద్యను అందించే ప్రయత్నంలో భాగంగా, శ్రీసిటీ పరిశ్రమల భాగస్వామ్యంతో శ్రీసిటీ ఫౌండేషన్ విద్యా వసతులను పెంపొందించేందుకు కృషిచేస్తుండడం తెలిసిందే. ఇందులో భాగంగా శ్రీసిటీలోని టీహెచ్‌కె, హంటర్ డగ్లస్ పరిశ్రమలు ప్రభుత్వ విద్యాసంస్థలకు డెస్క్‌టాప్ కంప్యూటర్లు, పోడియంలు, స్మార్ట్ డిస్‌ప్లే బోర్డులు, ప్రింటర్లు వితరణగా ఇచ్చాయి. ఇటీవల నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 25 లక్షల రూపాయల విలువ గల 30 డెస్క్‌టాప్ కంప్యూటర్లు, 25 పోడియంలను టీహెచ్‌కె కంపెనీ అందజేసింది. కంపెనీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ మకాటో సాటో ఇక్కడ కంప్యూటర్ ల్యాబ్‌ను లాంఛనంగా ప్రారంభించి, తమ సీఎస్ఆర్ నిధులతో విద్యాసంస్థల బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. టీహెచ్‌కె పరిశ్రమ విరాళం పట్ల ధన్యవాదాలు తెలిపిన విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎం సుందరవల్లి, తమపై ప్రత్యేక శ్రద్ధతో విద్యా పరికరాలు సాయం అందించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో తమకు వసతుల కల్పనకు కీలకపాత్ర పోషించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌కు..
# చాకిచర్ల విద్యార్థులు



రాష్ట్రస్థాయిలో ఈనెల 30వ తేది నుంచి కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే బ్యాడ్మింటన్ పోటీలకు నెల్లూరుజిల్లా ఉలవపాడు మండలం చాకిచర్ల జడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన పున్నేపల్లి ప్రేమ్‌కుమార్, వీరమల్లు గీతిక ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఇటీవల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు అభినందించారు.

# రూ.వెయ్యికే.. కట్టుడుపళ్ళు



నెల్లూరులోని నారాయణ దంతవైద్యశాల దంత చికిత్సా విభాగం ఆధ్వర్యంలో మలివయసులో దంతసంబంధిత సమస్యలు లేకుండా కట్టుడుపళ్ళు కట్టుకోవాలనుకునేవారికి కేవలం వెయ్యి రూపాయలకే ఆ సదుపాయం కల్పించడానికి సమాయత్తమయ్యారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈ వెసులుబాటు కల్పిస్తున్నారు. దంత వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజయ్‌రెజినాల్డ్ స్థానిక చింతారెడ్డిపాళెంలోని దంతవైద్యశాలలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మరీ ఈ విషయం చెప్పారు. కట్టుడుపళ్ళు కట్టుకోవాలంటే కనీసం 15 వేల రూపాయల దాకా ఖర్చవుతుందని, అయితే నారాయణ దంతవైద్యశాల కట్టుడుపళ్ళ శిబిరంలో వెయ్యి రూపాయలకే ఈ సౌకర్యాన్ని అందించనున్నామని తెలిపారు. కళాశాల ఏజీఎం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, అక్టోబరు 25వ తేది వరకు లభించే ఈ సౌకర్యాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకోవచ్చని ఆయన సూచించారు. అనంతరం డాక్టర్ కెవీ సునీల్, డాక్టర్ వి.దిలీప్‌నాగ్, డాక్టర్ టి.పవన్‌కుమార్, వంశీకృష్ణారెడ్డి, శరణ్‌బాబు, ఏఓ అరవింద్‌రెడ్డి తదితరులు కలిసి ఆమేరకు కరపత్రాలను కూడా ఆవిష్కరించారు.



# ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనోత్సవం

## ○ ఆకట్టుకున్న గంగాహారతి

వినాయక చవితిని పురస్కరించుకుని నెల్లూరు నగరంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం ఈనెల 23న ప్రశాంతంగా జరిగింది. భక్తులు నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న స్వర్ణాల చెరువులో గణేష్ ఘాట్ వద్దకు వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా గణేష్ ఘాట్ ప్రాంతాన్ని పెద్దఎత్తున విద్యుత్‌కాంతులతో శోభాయమానం చేశారు. మహిళలు భారీ సంఖ్యలో కదలివచ్చి శోభాయాత్రలో పాల్గొన్నారు. గణేష్‌ఘాట్ వద్ద జరిగిన గంగాహారతి కన్నులపండువగా ఉండి అందరినీ ఆకట్టుకుంది. మహిళల దీప హారతులు, కోలాహలంగా కోలాటాలు, పండరి భజనలు, మంగళ వాయిద్యాలు నడుమ స్థానిక స్వర్ణ లింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద నెలకొల్పిన గణనాధుని విగ్రహాన్ని ఉత్సవంగా తీసుకువెళ్లి, హరిద్వార్‌లో గంగాహారతులు నిర్వహించే వేదపండితుల చేతుల మీదుగా గణనాధుని గంగా హారతి కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వర్ణాల చెరువులో గణనాథుని నిమజ్జనోత్సవం జరిగింది. భువనేశ్వరి పీఠం అధిపతి శ్రీ కమలానందభారతిస్వామి పాల్గొని భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. ఈ వేడుకల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ పొట్లూరి స్రవంతి, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఛైర్మెన్ ఆర్ఎస్ఆర్ (రావు శ్రీనివాసరావు), గణేష్ ఉత్సవసమితి నాయకులు బయ్యా వాసు, పిట్టి సత్యనారాయణ, కర్నాటి ఆంజనేయ రెడ్డి, కార్పొరేటర్లు విజయలక్ష్మి, విజయభాస్కర్‌రెడ్డి, దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి నగరంలోని పలు ఇతర శాఖల అధికారులు, భక్తబృందాల వారు పాల్గొని నిమజ్జనానికి ఎలాంటి అంతరాయాలు కలుగకుండా పర్యవేక్షించారు. వేలాదిగా పాల్గొన్న భక్తులకు అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జనోత్సవాలు పూర్తిచేశారు.

# బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి



కేంద్రప్రభుత్వం ఇటీవల మహిళా బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే బీసీ మహిళలకు ఆ బిల్లులో 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని సీమాంధ్ర బీసీ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఉల్లిపాయల శంకరయ్య డిమాండ్ చేశారు. ఇటీవల ఆయన నెల్లూరులోని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, 75 ఏళ్ళ స్వతంత్ర భారతావనిలో బీసీ కులాలను ఓటు బ్యాంకుగానే రాజకీయపార్టీలు వాడుకుంటున్నాయి తప్ప న్యాయం చేసింది లేదని వాపోయారు. ఎన్నో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న కేంద్రం చట్టసభల్లో బీసీలకు కూడా రిజర్వేషన్‌లు ఇస్తే బీసీలకు మేలుచేసిన వారవుతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు దయాకర్‌యాదవ్, మురళి, వెంకటేశ్వర్లు, సందానిబాషా, సునీల్‌కుమార్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాబోయే సీఎం చంద్రబాబే!

## కందుకూరు టీడీపీ నేతలు దివి శివరాం, ఇంటూరి ధీమా



చంద్రబాబును అరెస్టు చేస్తే తెలుగుదేశం పార్టీ బలహీనపడిపోతుందని వైకాపా నాయకులు భ్రమపడుతున్నారని, కానీ ఎవరెన్ని కుట్రలు చేసినా టీడీపీ బలోపేతం అవుతుందే తప్ప తగ్గేదేమీ ఉండదని, కాబోయే సీఎం చంద్రబాబునాయుడేనని కందుకూరు టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా, ఈనెల 23న కందుకూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, చంద్రబాబుపై లేనిపోని అభాండాలు వేస్తూ ఎన్ని కట్టుకథలు ప్రచారం చేసినా ప్రజలు వైకాపాని నమ్మే స్థితిలో లేరన్నారు. వైకాపా అరాచకాలు చూసి ప్రజలు విసిగిపోయారని, ప్రజలు చంద్రబాబుపై, తెలుగుదేశం పార్టీపై ఆదరణ చూపుతున్నారని, రానున్న ఎన్నికల్లో వైకాపా ఓటమి తప్పదని వారు పేర్కొన్నారు.

# టూకీగా...



## వరికుంటపాడులో.. 'అక్షర చైతన్య' సమావేశాలు

మండలకేంద్రమైన వరికుంటపాడులో ఈనెల 23న అక్షర చైతన్య కేంద్రంలో సమావేశాలు జరిగాయి. ఎంపీడీఓ శ్రీదేవి పాల్గొని, మండలంలోని 16 కేంద్రాల్లో వయోజన అభ్యాసకుల పరీక్షలు నిర్వహించాలని ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లకు సూచించారు. 238 మంది అభ్యాసకులు పరీక్షలు రాస్తారని, అందరూ పరీక్షలకు వచ్చేలా చూడాలని ఆమె చెప్పారు.

## అయ్యవారిపల్లిలో 'ఆరోగ్య సురక్ష' శిక్షణ

సీతారామపురం మండలంలోని అయ్యవారిపల్లిలో ఈనెల 23న జగనన్న ఆరోగ్య సురక్షపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సంబంధిత జిల్లా అధికారి అభినవ్‌కుమార్, మండల అధికారి వెంకటసురేష్, సచివాలయ కన్వీనర్ బాలినేని మాబయ్య పాల్గొని ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహణపై సలహాలు సూచనలు ఇచ్చారు.

## మాలకొండ ఆదాయం.. రూ.8.34 లక్షలు

కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మండలం మాలకొండలో కొలువైవున్న ప్రసిద్ధమైన శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఈనెల 23వ తేదీ శనివారం ఒక్కరోజునే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 8,34,464 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

## వెంకట్రావుపల్లి వలంటీర్.. కన్నుమూత

ఆత్మకూరు మునిసిపాల్టీలోని వెంకట్రావుపల్లి సచివాలయంలో వలంటీర్‌గా ఉన్న కళ్లగుంట ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (30) ఈనెల 22వతేది రాత్రి గుండెపోటు వచ్చి నిద్రలోనే కన్నుమూశాడు. మునిసిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు, ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కౌన్సిలర్ శివకోటారెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

## చెల్లాయిపాలెంలో పిడుగుపాటు

బుచ్చిరెడ్డిపాళెం మండలం చెల్లాయిపాలెంలో ఇటీవల అర్ధరాత్రి సమయంలో వర్షంతోపాటు పిడుగులు పడ్డాయి. వైకాపా నాయకుడు కోవూరు మురళి ఇంటిపై పిడుగుపడి ఇల్లు కొద్దిగా దెబ్బతినింది. విద్యుత్‌వైర్లు కాలిపోయాయి. ప్రహరీ గోడపై పిడుగుపడడంతో గోడ ధ్వంసమైంది. అయితే, అదృష్టవశాత్తూ కుటుంబసభ్యులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

## కోవూరులో గణేశ్ ఉత్సవ సమితి అన్నదానం

గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఈనెల 23న కోవూరులోని గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదానం చేశారు. సమితి సభ్యులు ఉయ్యూరు వేణు, నిరంజన్, శ్యామ్ సుందర్, మణిదీప్, కార్తిరెడ్డి, కిషన్, కళ్యాణ్, చైతన్య, హర్ష, బాలకృష్ణ, చరణ్‌సాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## వెంకటాచలంలో శ్రీకృష్ణభగవానునికి పూజలు

మండలకేంద్రమైన వెంకటాచలంలో కొలువైవున్న శ్రీకృష్ణ మందిరంలో ఈనెల 23న ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాధాకృష్ణుని విగ్రహాలకు అభిషేకాలు చేసి, పల్లకి సేవ చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు మనోజ్‌గుప్తా, హరిబాబు, వెంకటరత్నం, రమేష్‌బాబు, రమణయ్య, శంకరయ్య, శివ, ఆకాష్ తదితరుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

## బుజబుజనెల్లూరులో వ్యక్తిత్వ వికాసంపై సదస్సు

నెల్లూరు రూరల్ మండలం బుజబుజనెల్లూరు జడ్పీ హైస్కూలులో ఈనెల 23న విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. సెట్నెల్ మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొని వ్యక్తిత్వ వికాసంపై, విద్యా ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిఎంపిల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, స్కూల్ ఇన్‌చార్జి హెడ్మాస్టర్ అచ్యుతమణి పాల్గొన్నారు.

## మర్లపూడి వద్ద ఆటోబోల్తా.. డ్రైవర్ దుర్మరణం

సైదాపురం మండలంలోని మర్లపూడి వద్ద ఈనెల 24న జరిగిన ప్రమాదంలో ఆటో బోల్తాపడి, డ్రైవర్ కటకం పెద్దపెంచలయ్య (53) దుర్మరణం పాలయ్యాడు. నిమ్మకాయల లోడ్‌తో గూడూరు వస్తుండగా మార్గమధ్యంలో కుక్క అడ్డంగా రావడంతో, ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. పెంచలయ్య ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరణించాడు.

# ముక్కోణపు ప్రేమకథా చిత్రం!

(మొదటి పేజీ తరువాయి)

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ని, ఆయన పార్టీని ఒంటరిగా పోటీ చేయించాలనే 'సదుద్దేశం'లో 'మోషా' (మోడీ, అమిత్ షా) ఉన్నట్టు ఢిల్లీవర్గాలలో ఓ చర్చ నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ పరిస్థితి... రాజకీయంగా బండి సున్నా. అందువల్ల, ఆంధ్ర రాజకీయంపై బీజేపీకి ఆసక్తి లేదు. మందుల కంపెనీల తయారీదారులు తమ ఉత్పత్తిని ముందుగా ఎలుకల మీద ప్రయోగించినట్టుగా, బీజేపీ ఆంధ్రలో ప్రయోగాలు చేయడానికి సిద్ధం అనే మాట కూడా వినబడుతోంది.

తెలుగుదేశంతో పొత్తుతో కాకుండా, కేవలం తమతో మాత్రమే పొత్తుతో జనసేన వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని బీజేపీ కేంద్రపెద్దలు గట్టిగా భావిస్తున్నారనడానికి ఆంధ్రలో బీజేపీకి వచ్చేది కానీ, పోయేది కానీ ఏమీ లేకపోవడమే ప్రధాన కారణం.

ఆ ప్రతిపాదనకు పవన్ ఓకే అంటే, ఆయనను తమ కూటమి 'ముఖ్యమంత్రి' అభ్యర్థిగా ప్రకటించాలనే ఉద్దేశంలో కూడా బీజేపీ పెద్దలు ఉన్నట్టు ఢిల్లీ నేతలు చెప్పున్నారు.. కేరళలో శ్రీధరన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించినట్టు(కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు వచ్చింది). తాను బీజేపీ కూటమిలోనే ఉన్నానని పవన్ కళ్యాణ్ అంటున్నారు గానీ, బీజేపీ చెప్పినట్టు వినే ఆలోచనలో లేరంటున్నారు. జనసేనానికి ఇప్పుడిప్పుడే రాజకీయం అర్థమవుతున్నట్టుంది.

తెలుగులో ఓ సామెత ఉంది. 'నువ్వు ఊరందరికీ తహశీల్దారువు గానీ... నాకు కూడా తహశీల్దార్‌వా? కాఫీ ఇచ్చేదాకా ఆగు...' అన్నదట ఓ ఇల్లాలు. ఆంధ్ర ఓటర్లకు పవన్ కళ్యాణ్ గానీ, బీజేపీ కేంద్ర నాయకులకు కాదు గదా!

అందుకే తనది తానే కదుక్కోవాలి తప్ప, ఢిల్లీలో ఉన్న గుజరాతీ పెద్దలు కాదు కదా...! అన్న స్పష్టత ఆయనకు వచ్చిందనే విశ్లేషకులు అంటున్నారు. కేవలం వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఏకైక లక్ష్యంతో పాటు, ఈసారి ఒక బలమైన పార్టీగా అసెంబ్లీలో అడుగుపెట్టి తీరాలనే దృఢ సంకల్పంతో పవన్ అడుగులు వేస్తున్నారు.

అయితే, రాష్ట్రంలో ఉన్న 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలలో ఎన్నింటిలో నేరుగా జనసేన పోటీ చేయాలన్న స్పష్టత ఇప్పటికీ పవన్‌కు లేదన్నది రాజకీయ వర్గాల అభిప్రాయం. అసలు జనసేన టికెట్‌పై పోటీ చేయడానికి 'మేం రెడీ' అని సిద్ధమయ్యేంత మంది అభ్యర్థులు జనసేనకు ఉన్నారా...? అనే ప్రశ్న కూడా వినపడుతోంది.

నిజానికి, తెలుగుదేశంకు ఇటు 175, అటు 25 స్థానాలలో పోటీ చేయడానికి తగిన అర్థబలం... అంగబలం కలిగిన నేతలు ఉన్నారు. నియోజకవర్గాలలో రాజకీయంగా ఊడలు భూమిలోకి దిగిపోయిన నేతలూ ఉన్నారు. వారు కాకపోతే వారి శ్రీమతి! ఆమె కాకపోతే వారి సంతానం..! వారు కాకపోతే అల్లుళ్ళు, కోడళ్ళు!. వారూ కాకపోతే కుటుంబసభ్యులలో ఎవరో ఒకరితో పోటీ చేయించగల సత్తా గలిగిన ఘనాపాఠీలు తెలుగుదేశం పార్టీలో ప్రతి నియోజకవర్గంలోనూ ఉన్నారు. కాకపోతే, గత ఎన్నికల్లో విధి వక్రించి వారికి 'వర్క్ ఔట్' కాలేదు. ఈసారి, ఎలాగైనా గెలవాలని బుసలు కొడుతున్నారు. ఇప్పుడు, 'పొత్తు' నేపథ్యంలో వారిలో కొందరిని బలవంతంగా సముదాయించి... బుజ్జగించి... లాలించి, ఏదో ఒక పదవి తాయిలం చూపించి... కొన్ని సీట్లు జనసేనకు ఇవ్వాలి. ఈ 'అనివార్య' పరిస్థితులలో జనసేన పట్ల తెలుగుదేశం అశేష కార్యకర్తల, సానుభూతి పరుల, శ్రేయోభిలాషుల స్పందన ఎలా ఉండబోతోందన్నది కూడా పవన్ అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న కేసులు, కోర్టులు, జైళ్లు, బెయిల్లు, కక్షసాధింపుల పర్వంలో రగిలిపోతున్న టీడీపీ సంప్రదాయ ఓట్ బ్యాంక్ (సుమారు 40శాతంకు పైబడి) జనసేనకు బాసటగా నిలబడుతుందని కూడా పవన్ భావిస్తుండవచ్చు. సీట్లు కేటాయించేది చంద్రబాబునాయుడే కాబట్టి, పవన్ కళ్యాణ్ కోరినన్ని స్థానాలను కుడి ఎడంగా టీడీపీ కేటాయిస్తే, ఆ స్థానాల్లో వైసీపీతో జనసేనకు ముఖాముఖి పోటీలో ఉండే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితులలో వైసీపీపై పోటీకి నామినేషన్ వేసేంత బలమైన రాజకీయ ఉద్దండులు జనసేనకు ఉన్నారా? అన్నది కూడా అనుమానమే!

జనసేన బి-ఫారం అందుకునే వాళ్ళు అత్యంత బలవంతులు కాకపోతే ఇబ్బందే. నామినేషన్ల దశలోనే వాళ్ళు చేతులెత్తేయవచ్చు... కుడి చేత్తో జనసేన టికెట్ తీసుకుని, ఎడమచేత్తో దాన్ని అమ్మకానికి పెట్టెయొచ్చు. ఆ తరువాత వైసీపీలోకి జంప్ కావచ్చు. లేదా, తెలుగుదేశంలోకీ జారిపోవచ్చు. నామినేషన్ వేసి, ఎవరికీ కనపడకుండా... 'మిస్' అయిపోవచ్చు. లేదా, రాజోలు నుంచి జనసేన తరఫున గెలిచిన రాపాక వరప్రసాద్ లాగా డైరెక్ట్‌గానే 'జై జగనన్నా' అనొచ్చు. అలాంటి తరుణంలో ఏం చేయాలన్న దానిపైన పవన్ కళ్యాణ్‌కు స్పష్టమైన యాక్షన్ ప్లాన్ ఉందా? లేదా?? అనే విషయంలో కూడా అభిమానులకు స్పష్టతలేదన్నది ఆ పార్టీవర్గాల అభిప్రాయం.

రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబునాయుడుని పరామర్శించడానికి వెళ్లిన పవన్ కళ్యాణ్ 'పొత్తు'ను ఏకపక్షంగా, 'సినిమాటిక్'గా ప్రకటించేశారు. నిజానికి ఏ రాజకీయపార్టీ ముఖ్యనేత అయినా మరో పార్టీతో పొత్తు ప్రకటించాల్సి వస్తే, సమస్త విషయాలపై స్థూలంగా ఒక విస్తృత అంగీకారం కుదిరిన తరువాతనే ఇరు పార్టీల నేతలూ కలిసి 'పొత్తు' ప్రకటన చేస్తారు. కానీ, ఇక్కడ పవన్ కళ్యాణ్ ఒక్కరే ఏకపక్ష ప్రకటన చేశారు. ఒక ప్రాంతీయ పార్టీ అధినేత, ఇతర పార్టీల గెలుపోటములను ప్రభావితం చేయగలిగిన స్థాయిలో ఓటు బ్యాంకు కలిగిన నేత, ఈ విధంగా ప్రకటించారు అంటే, 'పొత్తు'కు ఆయన ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇరు పార్టీల సీట్ల సర్దుబాటుతోపాటు, భవిష్యత్ వ్యూహాలపై ఒక అవగాహనకు వచ్చిన తరువాతనే పవన్, టీడీపీ కలిసి పొత్తు ప్రకటన చేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం రెండు పార్టీల శ్రేణుల నుండి వ్యక్తమవుతోంది.

టీడీపీతో వెళ్లాలని జనసేనాని డిసైడ్ అయిపోయారు కనుక, రాజకీయమంతా ఇప్పుడు పవన్ కళ్యాణ్ చుట్టూ తిరుగుతున్నట్టు కనపడుతోంది. నిన్నటిదాకా తమని ప్రేమించానని చెప్పిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు టీడీపీని పెళ్లిచేసుకుంటానని తెగేసి చెప్పడంతో బంతి బీజేపీ కోర్టులోకి వెళ్ళింది. వాళ్ళు కూడా టీడీపీతో కలసి సాగుతాం అంటారా...? లేక, ఎలాగూ ఆంధ్రాలో తమకి పెద్దగా సీన్ లేదు కాబట్టి, గోడమీద పిల్లిలా ఉండి ఎవరు నెగ్గితే వారివైపు మొగ్గుతారా అన్నది వేచి చూడాలి! ప్రస్తుతానికి మాత్రం బీజేపీ, పవన్ ఇంకా ప్రేమించుకుంటూనే ఉన్నారు, టీడీపీతో పవన్ నిశ్చితార్థం నిర్ణయమైపోయింది. ఈ ముక్కోణపు రాజకీయ ప్రేమకథ రాష్ట్రంలో ఈ మూడు పార్టీల భవిష్యత్తుతో పాటు, ఆంధ్రుల భవిష్యత్తుని ఏ మలుపు తిప్పుతుందో వేచి చూడాలి...!

# సత్యపీఠం

(4వ పేజీ తరువాయి)

అరెస్టుని సమర్థిస్తున్నారు. పార్టీయే ప్రాణంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు మాత్రం రోజూ అక్కడక్కడా నిరసనలు, ధర్నాలు, ప్రదర్శనలు చేస్తున్నారు. 45 సంవత్సరాలు రాజకీయాలలో ఉన్న నేతని, పద్నాలుగున్నర సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన నాయకుడిని అధికార పార్టీ అరెస్టు చేస్తే ప్రజలనుండి రావలసిన స్థాయిలో ప్రతిఘటన రాలేదు. పెద్దగా ప్రజా ప్రతిస్పందన కనిపించలేదు.

చంద్రబాబు తన 45 సంవత్సరాల ప్రజాజీవితంలో కేవలం రాజకీయమే శ్వాసగా బ్రతికారు. తనకోసం ప్రాణమిచ్చే మిత్రులను కొంతమందిని కూడా దగ్గర చేర్చుకోలేక పోయారు. తన కోసం ఉద్యమించే అభిమానులను తన సొంతం చేసుకోలేకపోయారు. 2014 వరకు పార్టీలో గానీ, అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వంలో గానీ 1 నుండి 100 దాకా అన్నీ తానే అన్నట్లుగా వ్యవహరించారు. 2014 తరువాత కొడుకుకి పెత్తనం ఇచ్చి దొడ్డిదారిన పదవి కట్టబెట్టి కుటుంబపాలనకి తెర లేపారు. లోకేష్‌కి నెం.2 స్థానం కల్పించి సొంతపార్టీ నేతలలోనే పలుచనైపోయారు. అంతకుమించి అమరావతిని రాజధానిగా చేసి తన సామాజికవర్గం చేతిలో బానిసగా మారారు. తన మామ విషయంలో చేసిన పాపం కొడుకు రూపంలో శాపమై ఆయన మెడకి చుట్టుకుంది. దేశ రాజకీయాలలో చక్రం తిప్పిన స్థాయినుండి స్కిల్ స్కామ్ స్థాయికి పడిపోయారు. హైటెక్ సిటీ, ఐటీ కారిడార్ల వంటి వాటికి స్ఫూర్తినిచ్చానని చెప్పుకుంటున్న బాబు... సింగపూర్, సినిమా సెట్టింగులనే స్థాయికి దిగిపోయారు. తాను ఎవరినీ నమ్మలేక తనని ఎవరూ నమ్మలేని పరిస్థితిని తెచ్చుకున్నారు. తన రింగులోకి కొడుకుని మాత్రమే లాక్కొని ఇన్నర్ రింగురోడ్డులో ఇరుక్కుపోయారు. నమ్మకం, నిజాయతీ, విశ్వాసం, విశ్వసనీయత అన్న పదాలకు బాబుకి అర్థమే తెలియదని సొంత పార్టీ నాయకులే విమర్శించే స్థాయిలో అప్రతిష్టపాలయ్యారు. ఇప్పుడు బాబు కుటుంబమంతా ఒక్కటయ్యింది. తన పతిపై సింపతీ కోసం ఆయన సతి భువనేశ్వరి రోడ్డెక్కింది. మా నాన్నని కాపాడండంటూ లోకేష్ ఢిల్లీ పెద్దలచుట్టూ తిరుగుతున్నాడు. మా మామని అరెస్టు చేశారు, మా వారిని కూడా అరెస్టు చేస్తారంట అంటూ బ్రాహ్మణి ప్రజల సానుభూతిని పొందడానికి ప్రయత్నం చేస్తోంది. ఇలా వాళ్లంతా ఒక్కటై పరితపిస్తున్నారు తప్ప ప్రజలనుండి మాత్రం స్పందన లేదన్నది నిజం.

ప్రజలు బయటకి రాకపోవడానికి చంద్రబాబుపైన ఉన్న వ్యతిరేకతే కారణం అని ఓ వర్గం అంటుంటే, అదేమీకాదు అధికారపార్టీ వాళ్ళు పెట్టే కేసులకు భయపడే ఎవరూ ముందుకు రావడంలేదని తెలుగు తమ్ముళ్లు సమర్థించుకుంటున్నారు. ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియాలంటే నిశ్శబ్దంగా తమ మనోగతాన్ని ఓటు రూపంలో చూపించే ప్రజాతీర్పు కోసం వేచి చూడాల్సిందే...!

- రాజశ్రీ



# బాలు పాటలు.. మధురాతి మధురాలు

గాన గంధర్వుడు దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు సినీ సంగీత ప్రపంచంలో అపూర్వమని, ఆయన కీర్తి అజరామరమని, బాలు పాటలు మధురాతి మధురాలని, సంగీతప్రియుల గుండెల్లో ఆ మహనీయుని గానం చిరస్థాయిగా నిలిచి వుందని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు, సి.రాఘవాచారి మీడియా అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈనెల 25న బాలు వర్ధంతి సందర్భంగా నెల్లూరు టౌన్‌హాల్‌లో సింహపురి సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో 'పాడుతా తీయగా' కళాకారులు నిర్వహించిన సంగీత స్వరార్చన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సినీ సంగీత ప్రపంచంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన తెలుగు భాష ఖ్యాతిని దశదిశలా చాటిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. 40 ఏళ్ళ సినీప్రస్థానంలో 40వేల పాటలు 11 భాషలలో పాడి, 40 సినిమాలకి సంగీత దర్శకత్వం వహించి ప్రపంచంలోనే ఒక అరుదైన రికార్డు సృష్టించిన ఘనత బాలుకే దక్కిందని వారు ప్రశంసించారు. అనంతరం, సంగీత విద్వాంసుడు రామాచారికి, అభినవ ఘంటసాల పాటూరు శ్రీనివాసులుకు బాలు పురస్కారాలను అందజేశారు. సమాఖ్య నిర్వాహకులు రాంజీ, లిటిల్ మ్యూజికల్ అకాడమీ వ్యవస్థాపకులు రామాచారి, నలుబోలు బలరామయ్య నాయుడు, పాడుతా తీయగా కళాకారులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# అమెరికా యూనివర్సిటీతో.. ఎన్‌బికెఆర్ ఒప్పందం



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్, డార్ట్‌మౌత్‌తో విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఒప్పందంతో ఎన్‌బికెఆర్ విద్యార్థులు అయిదు సంవత్సరాల్లో బీటెక్‌తో పాటు అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసేందుకు అవకాశం ఉంటుంది. యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ అసోసియేట్ వైస్‌ఛాన్సలర్ డా.డి.టెఫ్ఫే మెరిస్సీ ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా.విజయకుమార్‌రెడ్డి అధ్యాపకుల సమక్షంలో వర్చువల్‌గా ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా టెఫ్ఫే మెరిస్సీ మాట్లాడుతూ, ప్రపంచంలోని అత్యున్నత విద్యాసంస్థలో ఎన్‌బికెఆర్ విద్యార్థులు చదువుకునేందుకు ఇదొక మంచి అవకాశమని, భవిష్యత్తులో మంచి ఉద్యోగావకాశాలు పొందేందుకు ఇదెంతో దోహదపడుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఎన్‌బికెఆర్ కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలియజేశారు.

# సందడిగా చెస్ పోటీలు

## ప్రథమస్థానం సాధించిన రవితేజ




నెల్లూరులో ఇటీవల వైవి రమణారెడ్డి స్మారక ద్వితీయ అఖిలభారత ఓపెన్ చెస్ పోటీలు సందడిగా జరిగాయి. పోటాపోటీగా రెండురోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో కర్నూలుజిల్లా ఆదోనికి చెందిన ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ రవితేజ విజేతగా నిలిచారు. బహుమతి ప్రదానోత్సవంలో బెంగాల్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి అతున్ లహిరి మాట్లాడుతూ, చెస్ ద్వారా ఏకాగ్రత కుదురుతుందని, మేధస్సు పెరుగుతుందని భారతీయ పురాతన క్రీడ చదరంగమని చెప్పారు. అలాంటి విశిష్టమైన ఈ క్రీడా పోటీలను నెల్లూరులో నిర్వహించడం, దేశవ్యాప్తంగా 400 మంది అగ్రశేణి క్రీడాకారులు వచ్చి ఈ పోటీల్లో పాల్గొనడం విశేషమన్నారు. ఈ పోటీలకు సహకరించిన వై.వి.రమణారెడ్డి ట్రాన్స్‌పోర్టు అధినేత సుధాకర్‌రెడ్డికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ద్వితీయస్థానంలో నిలిచిన ఫిడే మాస్టర్ టైటిల్ విజేత సయ్యద్ అన్వర్ షాజులిని, తృతీయ స్థానం సాధించిన కొత్తగూడెం జిల్లాకు చెందిన క్యాడెట్ మాస్టర్ షేక్. సుమిర్ అర్షిలను అందరూ అభినందించారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్, టోర్నీ నిర్వాహకులు వెంకటేష్, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది శ్రీహరి, నర్రా విజయ్‌కుమార్, టోర్నీ ఆర్బిటర్స్ గోపీనాథ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# వలంటీర్ కుటుంబానికి..అండగా ప్రసన్న



## సీఎం సహాయనిధి నుండి 5 లక్షల సాయం

కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలం, దామేగుంటలో గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీపతి విష్ణుప్రియ ఇటీవల మనుబోలు దగ్గర రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్ళారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 5లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించి, ఆ చెక్కును స్వయంగా తన చేతులమీదుగా ఎమ్మెల్యే ప్రసన్న ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

# ఏఎస్‌పేట దర్గాలో.. వైభవంగా గంధోత్సవం

జిల్లాలోని ప్రసిద్ధమైన అనుమసముద్రంపేట (ఏఎస్‌పేట)లో వెలసివున్న హాజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో ఈనెల 24న దొరసానమ్మ అమ్మవారి పవిత్ర గంధోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్గాలోని సమాధులపై పూలచద్దర్లు పరచి ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. వక్ఫ్‌బోర్డు ఇఓ మహ్మద్ హుస్సేన్ పాల్గొని దర్గా కార్యాలయం వద్ద నుంచి గంధకలశాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు గంధాన్ని పంపిణీ చేశారు. ఆత్మకూరు డిఎస్పీ కోటారెడ్డి పర్యవేక్షణలో సిఐ రవినాయక్, ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

# దివ్యాంగులకు ఉపకరణాలు

దివ్యాంగులకు అండగా వుంటూ వారిలో మానసిక స్థైర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈనెల 24న వెంకటాచలం వద్ద ఉన్న దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, పునరావాస మరియు సాధికారత సమ్మిళిత కేంద్రం (కాంపోజిట్ రీజనల్ సెంటర్)లో పలువురు దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీచేశారు. 225 మంది విభిన్న ప్రతిభావంతులకు 38.71 లక్షల రూపాయల విలువచేసే పరికరాలను అందజేశారు. భారతీయ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ అలింకో వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, తిరుపతి పార్లమెంట్ సభ్యులు ఎం.గురుమూర్తి, జాయింట్‌కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, భారతీయ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ అలింకో సిఇఓ రవి శంకర్, దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, పునరావాస మరియు సాధికారత సమ్మిళిత కేంద్రం డైరెక్టర్ రాజ్ మణిపాల్, జడ్పీ సిఇఓ బి.చిరంజీవి, వికలాంగుల శాఖ అధికారి అక్బర్ ఆలీ, డీఆర్డీఏ పీడీ సాంబ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీసిటీలో 'పోష్' చట్టంపై అవగాహన సదస్సు

పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నివారణ (పోష్) చట్టంపై అవగాహన సదస్సు ఇటీవల శ్రీసిటీలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని శ్రీసిటీ, మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, కొన్రాడ్-అడెనౌర్-స్టిఫ్టుంగ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించాయి. ఇందులో గుర్తింపు పొందిన పోష్ శిక్షకురాలు శ్రీమతి తిలగా పోర్చెల్వన్ పాల్గొన్నారు. శ్రీసిటీ హెచ్ఆర్ ఏజీఎం వి.శివకుమార్ అతిథులను ఆహ్వానించారు. శ్రీమతి తిలగా మాట్లాడుతూ, పోష్ చట్టం ఆవశ్యకతను వివరించారు. కంపెనీలలో లైంగిక వేధింపుల నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలను, యాజమాన్యాల బాధ్యతలను గుర్తుచేశారు. చెన్నైకి చెందిన ఎంఎంఏ ప్రతినిధి ఆర్.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

# జడ్పీ ఉద్యోగుల ఔదార్యం

నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో పనిచేస్తున్న షకీరాబాను అనే ఉద్యోగిని తీవ్ర అనారోగ్యంతో బాధపడడం చూసి, జడ్పీలో వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులందరూ ఆమెకు తమవంతు ఆర్థికసాయంగా లక్షా 33 వేల రూపాయలను సేకరించి ఇచ్చి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆ మొత్తాన్ని ఇటీవల జడ్పీ ఛైర్‌పర్సన్ చేతులమీదుగా బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. ఎన్‌డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, జడ్పీ సిఇఓ చిరంజీవి, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# వృద్ధులకీ ఒక పథకం కావాలి..!

తిన్నా... తినకపోయినా, చదువుకున్నా.... చదువుకోకపోయినా, ఆడైనా... మగైనా, గౌరవంగా బతికినా... పరమ ఛండాలంగా బతికినా... ఎలా బతికినా – మనిషి జన్మ ఎత్తితే చాలు కాలక్రమంలో అరవై ఏళ్ళు దాటి వృద్ధాప్యంలోకి అడుగు పెడతాం.

వ్యాధులు, ప్రమాదాలు, ఫ్యాక్షనిస్టులు, పాలెగాళ్ళ బారినపడి... అర్ధంతరంగా తనువు చాలించాల్సి రాకపోతే వృద్ధాప్యం అనేది ప్రతి ఒక్కరికీ వస్తుంది.

వీరిలో... సక్రమమైన జీవనాధారం ఉన్నవారికి... సరే!

మరి, ఏ జీవనాధారమూ లేని వారి పరిస్థితి ఏమిటి?

భారతదేశ జనాభా 140 కోట్లు దాటిందనుకుంటే.... వారిలో 10శాతం వృద్ధులు. అంటే.. దాదాపు 14 కోట్లు. ప్రపంచంలో గల 190కి పైబడిన దేశాలలో... కనీసం 170 దేశాల జనాభా కూడా మన దేశంలోని వృద్ధుల జనాభా అంత లేదు. రష్యాను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్న యుక్రెయిన్ జనాభా నాలుగు కోట్లు. 140 కోట్ల జనాభా కలిగిన భారత్‌ను కారుకూతలు కూస్తున్న కెనడా జనాభా కూడా నాలుగు కోట్లే.

మన దేశంలోని వృద్ధులను కనీసం రెండు వర్గాలుగా విభజించవచ్చు.

'కరివేపాకు'ను నాగరికత బాగా ముదిరి, 'కొరివేప్రాకు' అని పిలిచినట్టు.. మన వృద్ధులలో కొందరు 'సీనియర్ సిటిజన్స్' అయితే... కొందరేమో... 'ముసలోళ్లు'. ఇంకా ప్రేమగా చెప్పాలంటే... 'సమాజం దృష్టిలో ముసల్నాకొడుకులు'.

మొత్తం వృద్ధుల్లో... సీనియర్ సిటిజన్లు ఓ పది, పన్నెండు శాతమే. వీరికి జీవనాధారానికి లోటు ఉండదు. ప్రభుత్వోద్యోగులుగా రిటైర్ అయినవారో, ఉద్యోగాలున్నప్పుడు తెగబడి మేసేసినవారో... రిటైర్ అయ్యాక కూడా ప్రభుత్వ సొమ్ము కోసం వెంపర్లాడేవారో, పింఛన్ల మీద గౌరవంగా జీవించేవారో, పొద్దు వాలిపోక ముందే చర, స్థిరాస్తులను జాగ్రత్త చేసుకున్న వారో, వ్యాపారవర్గాల వారో, దయగల సంతానం కలిగి, తల్లిదండ్రులను పువ్వుల్లో పెట్టి చూసుకునే పిల్లలు గలవారో, రాజకీయాల్లో 'తిరుగుతూ' దిబ్బలు వేసి పోయినవారో, ఒక్కసారి ఎంఎల్ఏనో, ఎంపీనో చేసిన పుణ్యానికి బతికినంత కాలమూ జనం డబ్బును పింఛన్లుగా ఆరగిస్తూ తిరిగేవారో... 'సీనియర్ సిటిజెన్'లు. జీవించినన్నాళ్ళు, వారు దర్జాగా జీవిస్తారు.

దేశంలోని 14 కోట్ల మంది వృద్ధుల్లో ఈ బాపతు 'సీనియర్ సిటిజెన్'లు ఓ రెండు కోట్ల మంది ఉంటే ఉండవచ్చు.

మిగిలిన దాదాపు 12 కోట్ల మంది ముసలా... ముతకా జనం దిక్కు, మొక్కు లేని జనం.

కట్టుకోడానికి బట్ట ఉండదు. తినడానికి తిండి ఉండదు. ఉండడానికి ఇల్లు లాంటిది ఉండదు. రోగం వస్తే, చూడడానికి మనిషి ఉండదు. ఓ బిళ్ళ కొనుక్కుని వేసుకుందామంటే డబ్బులు ఉండవు.

వీళ్లకు ఆస్పత్రులు వైద్యం చెయ్యవు. ఇన్సూరెన్సు కంపెనీలు ఇన్సూరెన్సు ఇవ్వరు. బ్యాంకులు లోన్లు ఇవ్వవు. క్రెడిట్ కార్డులు మంజూరు చెయ్యవు. తెలిసినవారు పలకరించరు. పిల్లలు దగ్గరికి రానివ్వరు. అనాథ శరణాలయాల్లో ఖాళీలు ఉండవు.

మరి, వారూ భారతమాత ముద్దుబిడ్డలే, దేశ గమనంలో తమవంతు పాత్ర పోషించినవారే. పన్నులు కట్టిన వారే. ఓటు హక్కూ ఉన్నవారే.

మరి, వారిని ఎవరు పట్టించుకోవాలి? వారికి గౌరవప్రదమైన జీవన స్థితిగతులు ఎవరు కల్పించాలి? మనవి అన్నీ సంక్షేమ ప్రభుత్వాలే. లక్షలకు లక్షల కోట్లు సంక్షేమం పేరిట... జనానికి ధారబోస్తున్న ప్రభుత్వాలే.

'వృద్ధాప్యం' అనేది కులం చూడదు. మతం చూడదు. ప్రాంతం చూడదు. ఏదో ఒక కారణం వల్ల, అర్ధాయుష్కులు కాకపోతే, అది ప్రతివారికీ వస్తుంది.






సక్రమమో... అక్రమమో... ఏదో ఒక జీవనాధారం కలిగిన వారిని ప్రభుత్వాలు పట్టించుకోవలసిన అవసరం లేదు.

కానీ, గాలిలో దీపాల్లాంటి దీన వృద్ధులను పట్టించుకోని ప్రభుత్వాలు... ఏమి ప్రభుత్వాలు?

మన రాష్ట్రం విషయానికి వస్తే, రాష్ట్ర జనాభా సుమారు అయిదున్నర కోట్లు. అందులో వృద్ధులు దాదాపు 50–60 లక్షల మంది ఉంటారు.

వారిలో ఒక క్రమమైన జీవనాధారం కలిగిన 'సీనియర్ సిటిజన్స్'ను వేరుచేసి చూస్తే... ఏ దిక్కు, మొక్కు లేనివారు సుమారు నలభై లక్షల మంది ఉండి ఉంటారు.

ప్రభుత్వం వారికోసం ఏదైనా ఒక జీవనాధార పథకం ప్రారంభించి ఉంటే... వారు ఎంతో కొంత గౌరవంగా జీవించడానికి అవకాశం లభించి ఉండేది.

ఎందుకంటే.. జగన్‌మోహన్‌రెడ్డి ఒక సంక్షేమ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఓ సారి పరికిస్తే...

1. వైఎస్ఆర్ అమ్మ ఒడి...
2. వైఎస్ఆర్ జగనన్న విద్యా దీవెన!
3. వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా!
4. వైఎస్ఆర్ నవశకం!
5. వైఎస్ఆర్ వసతి దీవెన!
6. వైఎస్ఆర్ లా నేస్తం!
7. వైఎస్ఆర్ మత్స్యకార భరోసా!
8. వై.ఎస్.ఆర్ నేతన్న నేస్తం!
9. వైఎస్ఆర్ పెన్షన్ కనుక!
10. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ
11. వైఎస్ఆర్ కాపు నేస్తం!
12. వైఎస్ఆర్ వాహన మిత్ర!
13. వైఎస్ఆర్ విద్యా పురస్కారం!
14. వైఎస్ఆర్ కంటి వెలుగు!
15. వైఎస్ఆర్ ఆదర్శం!
16. వైఎస్ఆర్ రైతు భరోసా!
17. వైఎస్ఆర్ నవోదయం!
18. వైఎస్ఆర్ పెళ్లి కానుక!

ఇన్ని 'సంక్షేమ' పథకాలు ప్రారంభించడంలోని ప్రధాన ఉద్దేశం.. సమాజంలోని పౌరులందరికీ ప్రాథమిక జీవన వసతులు అంది, వారు గౌరవప్రదమైన జీవనం గడిపేటట్టు చూడడం అని ప్రభుత్వం ప్రకటించింది.

అయితే, ఏ జీవనాధారం లేని స్త్రీ పురుషులకు ఒక 'సంక్షేమ' పథకం కూడా లేదు. వారికీ ఓటు హక్కు ఉన్న విషయాన్ని పథకాల రూపకర్తలు మరిచిపోయినట్టున్నారు.

జీవనాధారం లేని, అయినవాళ్ళు లేక... ప్రేమగా పలుకరించే దిక్కు లేని వృద్ధ స్త్రీ పురుషుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక సంక్షేమ పథకం తీసుకురావాలి. వారికి "షెల్టర్ హోమ్"లు ప్రతి గ్రామం, మునిసిపల్ వార్డ్‌లో ఏర్పాటు చేసి... వారికి కట్టుబట్టలు, భోజన, వైద్య సదుపాయాలు చూసే బాధ్యత గ్రామ/వార్డ్ సచివాలయాలకు అప్పగించాలి. జీవన చరమాంకంలో వారు ఆత్మ న్యూనతా భావంతో చనిపోకూడదు. వారి అంత్యక్రియలు... ఈ సమాజం తరఫున ప్రభుత్వమే చేయించాలి.

గ్రామ/వార్డు సచివాలయాల ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధమని కాగ్ చెప్పిందంటున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవలసిన పని లేదు. ఈ దేశంలో ఏది రాజ్యాంగబద్ధంగా నడుస్తోంది గనుక... గ్రామ / వార్డు సచివాలయాలు రాజ్యాంగబద్ధం కాదు అనుకోడానికి!!? పని ముఖ్యం కానీ, రాజ్యాంగం కాదు.

**- భోగాది వేంకట రాయుడు**
medhomadhanam@gmail.com

# వేమిరెడ్డి దంపతుల వితరణ

## 2వేల మంది టిటిడి ఉద్యోగులకు.. నూతన వస్త్ర బహుకరణ



రాజ్యసభ సభ్యులు, సేవాభూషణ్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి టీటీడీ ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి (న్యూఢిల్లీ) ఛైర్‌పర్సన్ ప్రశాంతిరెడ్డి దంపతులు టీటీడీ ఉద్యోగులు సుమారు రెండువేల మందికి నూతన వస్త్రాలను బహుకరించి తమ వితరణను చాటుకున్నారు. ఈనెల 25న తిరుమలలో టీటీడీ ఛైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి సమక్షంలో వేమిరెడ్డి దంపతులు ఈ కార్యక్రమం నిర్వహించారు. తిరుమలలో జరుగుతున్న శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి అర్చకులు, లడ్డూలు తయారుచేసే సిబ్బంది, ఇతర విభాగాల ఉద్యోగులు శ్రీవారి భక్తులకు ఉత్తమ సేవలు అందిస్తూ, తిరుమల పవిత్రతను కాపాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన నేపథ్యంలో ఉద్యోగుల సేవలను గుర్తించిన వేమిరెడ్డి దంపతులు వారిని అభినందిస్తూ నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా టీటీడీ సిబ్బంది, అర్చకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## శ్రీవారి సేవలో...



తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరుగుతున్న రథోత్సవంలో పాల్గొని రథాన్ని లాగుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిటిడి బోర్డు ఛైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇ.ఓ ధర్మారెడ్డి తదితరులు.

# ప్రభుత్వ పాఠశాలల్లో.. 'స్వచ్ఛతే సేవ'

### - క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి





భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూని కేషన్–నెల్లూరు కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 27న పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో ఉత్సాహంగా 'స్వచ్ఛతే సేవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని కెఎన్ఆర్ నగరపాలక సంస్థ పాఠశాల, బి.వి.నగర్, జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్, దర్గామిట్ట లోని రామయ్య బడి, ఫతేఖాన్‌పేట పాఠశాలల్లో భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి (ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్) పరవస్తు నాగసాయి సూరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో 'స్వచ్ఛత ప్రతిజ్ఞ' చేయించారు. చెత్తరహిత భారతదేశాన్ని మహాత్మునికి నివాళిగా అందించే సంకల్పంతో సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2 వరకూ కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. స్వచ్ఛభారత్ స్ఫూర్తిని వివరిస్తూ, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శాసనమండలి కమిటీల్లో.. పర్వతరెడ్డికి చోటు



ఆంధ్రప్రదేశ్ శాసనమండలి నుంచి ప్రభుత్వం తాజాగా ఏడు నూతన కమిటీలను ఏర్పాటు చేసింది. అందులో 2 కమిటీలలో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ప్రాతినిధ్యం కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. కమిటీ ఆన్ రూల్స్, తెలుగు భాష–సంస్కృతుల అభివృద్ధి కమిటీలకి ఆయన సభ్యులుగా వ్యవహరించనున్నారు.

# రాష్ట్రపతి అవార్డుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్.. సాత్విక

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)కి మరో అరుదైన గౌరవం లభించింది. ఈ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా 2019 నుంచి మూడేళ్లపాటు సేవలందించిన పెళ్ళకూరు సాత్విక రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక కావడం విశేషం. విఎస్‌యులో ఆమె అనేక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అందరి ప్రశంసలందుకున్నారు. ఆమె ఉత్తమసేవలకు గుర్తింపుగా 2021–22 సంవత్సరానికి ఈ అవార్డు లభించింది. విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.ఎం సుందరవల్లి ఈ సందర్భంగా సాత్వికకు అభినందనలు తెలిపారు.



సాత్వికను అభినందిస్తున్న విఎస్‌యు వీసీ ఆచార్య సుందరవల్లి




జననం : 01-08-1949 మరణం : 18-09-2022

స్వర్గీయ శ్రీ పెమ్మారెడ్డి మునికృష్ణారెడ్డి గారు

మాజీ ఛైర్మెన్, వ్యవసాయ శాఖ మార్కెటింగ్ కమిటి - సూళ్ళూరుపేట

మాజీ ఛైర్మెన్, ఫార్మర్స్ కో–ఆపరేటివ్ సొసైటి - సూళ్ళూరుపేట

ప్రథమ వర్ధంతి

నిజమైన ప్రజాసేవకు నిలువెత్తు రూపం మీరు,
నీతి నిజాయితీలకు ప్రతిరూపం మీరు,
మంచికి, మానవత్వానికి ఆదర్శంగా నిలిచిన మీ రూపం
మా హృదయాలలో సుస్థిరం.
మా అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మా దైవం

శ్రీ పెమ్మారెడ్డి మునికృష్ణారెడ్డి గారి

సంవత్సరీకము

తేది. 6-10-2023 శుక్రవారం ఉదయం 11 గంటలకు
సూళ్ళూరుపేట, గవర్నమెంట్ హాస్పిటల్ వీధిలోని
మా స్వగృహము నందు జరుగును.
కావున తెలియపరచడమైనది.

ఇట్లు :

ధర్మపత్ని: పెమ్మారెడ్డి ప్రభావతమ్మ

కుమారులు:

పెమ్మారెడ్డి మునిచంద్రారెడ్డి
పెమ్మారెడ్డి జయచంద్రారెడ్డి
పెమ్మారెడ్డి త్రిలోక్‌చంద్రారెడ్డి


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com